హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	240	270
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.5 । కనిష్ఠం 25.0

పుడమితల్లికి పుట్టెడు కష్టాలు

ఎరువులు, ప్లాస్టిక్‌తో భూసారం కలుషితం

నేడు ధరిత్రి దినోత్సవం

భూమి సకల జీవులకు ప్రాణాధారం. జీవకోటికి ఆహారాన్ని అందిస్తున్న భూమి అభివృద్ధి పేరుతో మనిషి చేసే విధ్వంసానికి బలైపోతోంది. భూకాలుష్యం రోజురోజుకూ పెరుగుతుండగా, భూపరిరక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోకపోగా చెట్ల నరికివేత, సహజ నిక్షేపాల వెలికితీతతో మరింత దెబ్బతీస్తున్నాయి. దీని పర్యవసానమే భూకంపాలు, సునామీలు సంభవిస్తున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. పరిశ్రమలు విడుదల చేసే వాయువుల ప్రభావంతో వాతావరణంలో సమతుల్యత దెబ్బతిని భూమి రోజురోజుకూ వేడెక్కుతోంది. సాంకేతీకరణ పెరిగి నూతన ఆవిష్కరణలు వస్తున్నా సహజవనరులను నియంత్రణ లేకుండా వినియోగిస్తుండటంతో ధరిత్రి దెబ్బతింటోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా విస్తీర్ణం 14.25 లక్షల హెక్టార్లు ఉండగా, అందులో కేవలం 6శాతం మేరకే అడవులు ఉన్నాయి. 83,859 హెక్టార్లలో మాత్రమే అటవీ విస్తీర్ణం ఉంది.

●6లో..





పెండింగ్ బిల్లుల కోసం.. ఎదురుచూపు



- మార్చిలో చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినా అందని నిధులు
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ.150కోట్ల వరకు బకాయిలు
- వడ్డీల భారంతో ఇబ్బంది పడుతున్నామంటున్న మాజీలు

పదవిలో ఉన్నప్పుడు చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతో మాజీ సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు. బిల్లులు పెండింగ్ ఉండడంతో చేసిన అప్పులకు వడ్డీ చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు.పెండింగ్ బిల్లులన్నీ మంజూరు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం పూర్తిస్థాయిలో చెల్లించకపోవడంతో అవస్థలుపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదవీకాలం ముగిసి ఏడాదిన్నరైనా పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడం దారుణమని వాపోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,740 గ్రామపంచాయతీలు ఉండగా, సుమా రు రూ.150కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని తక్షణమే చెల్లించి ఆదుకోవాలని మాజీ సర్పంచ్‌లు డిమాండ్ చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1,740 గ్రామపంచాయతీలు ఉండగా నల్లగొండ జిల్లాలో 844, సూర్యాపేటలో 475, యాదాద్రి జిల్లాలో 421 పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాలు నిధులిచ్చేవి. గ్రామాల్లో ఈ నిధులతోనే అభివృద్ధి పనులు నిర్వహిస్తారు. ప్రతీ మూడు నెలలకోసారి ఈ నిధులు వచ్చేవి. దీంతో పనులు చేస్తే ఢోకా ఉండదనే నమ్మకంతో సర్పంచ్‌లు సొంత పైసలతో పనులు చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడం,అదే సమయంలో పాలకవర్గాల గడువు ముగియడం, తదితర కారణాలతో చేసిన పనుల కు బిల్లులు నిలిచిపోయాయి. సీసీ రోడ్లు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణా లు, డ్రైనేజీలు, వీధిదీపాల ఏర్పాటు, శ్మశానవాటికలు, పల్లె ప్రకృతివనాలు, పైప్‌లైన్లు, డంపింగ్ యార్డుల నిర్మాణాలు, క్రీడామైదానాలు, వాటర్ మోటర్లు ఏర్పాటు వంటి పనులకు చేసిన బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సర్పంచ్‌లు వాపోతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ పనులకు సంబంధించి సుమారు రూ.150కోట్ల వరకు బకాయిలున్నాయి. నల్లగొండ జిల్లాలోరూ.60 కోట్లు

- మిగతా 7వ పేజీలో...

రూ.10లక్షల వరకు బిల్లులు పెండింగ్



మా గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలతో పాటు రైతు వేదిక, పల్లె ప్రకృతివనాలకు సంబంధించిన బిల్లులు సుమారు రూ.10లక్షల వరకు రావాల్సి ఉంది. రెండేళ్ల నుంచి బిల్లులు రాకపోవడంతో అవస్థపడుతున్నాం. ఎంబీలు సైతం చేసినా బిల్లులు మంజూరు చేయడం లేదు. ప్రభుత్వం తక్షణం స్పందించి పాత బిల్లులు వెంటనే చెల్లించాలి.

- ఈడం రోజా, గట్టుప్పల్ మాజీ సర్పంచ్

రెండేళ్ల నుంచి రూ.20లక్షలు ఆగాయి



గ్రామంలో పల్లెప్రగతి కింద చేపట్టిన డ్రైనేజీల నిర్మాణాలు, ఎస్ఎఫ్‌సీ కింద చేపట్టిన పనులు, పైప్‌లైన్ల ఏర్పాటు, నర్సరీలు, ట్రాక్టర్ల నిర్వహణలకు సంబంధించిన సుమారు రూ.20లక్షల బిల్లులు పెండింగ్ ఉన్నాయి. బిల్లులు వస్తాయనే నమ్మకంతో వడ్డీలకు తెచ్చి పనులు చేయించాం. వడ్డీలు పెరుగుతున్నాయే తప్ప బిల్లులు ఇవ్వడం లేదు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా ఇస్తామంటున్నారే తప్ప రావడం లేదు.

- రొట్టెల రమేష్, తిప్పర్తి మాజీ సర్పంచ్

సాగుకు సాంకేతిక ఊతం



వ్యవసాయరంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్నాహాలు చేస్తున్నాయి. పంటలు సాగుపై ఇప్పటికే ప్రభుత్వాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నాయి.దీనికి తోడు రైతులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సంక్షేమ పథకాలు,విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, తదితర అంశాలను సులభతరం చేసేందుకు సన్నద్ధమవుతున్నాయి. ఆధార్ కార్డు మాదిరిగా రైతుల కు భూధార్ కార్డులతో గుర్తింపు ఇవ్వనున్నారు. అన్నదాతకు సం బంధించిన భూ కమతానికి 14 అంకెలతో కూడిన విశిష్ట సంఖ్య(యూనిక్ కోడ్) కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

- ఆధార్‌కార్డు మాదిరిగానే రైతులకు భూధార్‌కార్డు
- 14 అంకెలతో యూనిక్ కోడ్

భూదార్ కార్డు జారీ కోసం కేంద్ర ప్రభుత్వ అధికారులు తాజాగా రాష్ట్ర వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి రైతులకు సంబంధించిన పూర్తి వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని, దీనికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేస్తామని పేర్కొన్నారు. వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు జిల్లా అధికారులతో సమావేశాలు నిర్వహించి, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న యూనిక్‌కోడ్‌ను ప్రతిష్ఠాత్మకంగా భావించాలని, రైతులకు సంబంధించిన సేవలను పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలని సూచించారు. ఈ మేరకు అన్ని జిల్లాల్లోనూ వ్యవసాయశాఖ పరిధిలోని డివిజన్, మండల ఏఈవోలతో సమావేశాన్ని ఏర్పాటుచేసి, వారికి యూనిక్ కార్డు నమోదుకు సంబంధించిన పూర్తి అవగాహన కల్పించనున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖ అధికారులతో యూనిక్‌కోడ్ నమోదుపై సమావేశాన్ని ఏర్పాటుచేసి వివరించారు. అన్ని డివిజన్లలో సంబంధిత అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. భూములు ఉన్న ప్రతీ రైతు వద్దకు వెళ్లి పట్టాదారు పుస్తకాల ఆధారంగా సర్వే నిర్వహించి, ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదు చేయనున్నారు.

భూముల వివరాలు ఫార్మర్ రిజిస్ట్రీలో

ప్రతీ రైతుకు సంబంధించిన భూముల వివరాలు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదవుతాయి. రైతులకు విశిష్ట సంఖ్య కేటాయించడంతో బ్యాంకింగ్, బీమా, తదితర వ్యవస్థలకు సులభంగా అనుసంధానం చేసుకునే అవకాశం ఉంటుంది. భూయాజమాన్య హక్కుల గుర్తింపు, వివాదాలను నివారించి పారదర్శకత పెంచేందుకు ఆస్కారం ఉంటుంది. రైతు విశిష్ట సంఖ్యను పొందేందుకు ఆధార్‌కార్డుతో పాటు దానికి అనుసంధానమైన మొబైల్‌నెంబరు, భూపట్టాదారు పాస్‌పుస్తకం ఏఈవోలకు అందించాలి. రైతు భరోసా, రుణమాఫీతో ఈ గుర్తింపు సంఖ్యకు ఎలాంటి సంబంధం లేదని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతానికి కేంద్ర ప్రభుత్వ పథకాలకు మాత్రమే దీన్ని ప్రామాణికంగా తీసుకోనున్నట్టు సమాచారం.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

కలెక్టర్ ఇలా త్రిపాఠి



డిండిలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

డిండి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు ఆక్రమించే ప్రయత్నం చేస్తే చట్టపర చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం డిండి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో 'భూభారతి' చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అసైన్డ్ భూమిని (ప్రభుత్వ భూమి) ఎవ్వరూ విక్రయించవద్దన్నారు. రైతులు సాగుచేస్తున్న నీటిపారుదలశాఖ భూములపై రైతులకు హక్కులు కల్పించాలని వంగాల లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ తహసీల్దార్ అంబటి ఆంజనేయులును రైతులు సాగుచేస్తున్న భూముల వివరాలు కోరగా, ఆయన సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

భూ భారతితో భూసమస్యలు 99శాతం పరిష్కారం అవుతాయని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, నయాబ్ తహసీల్దార్ రాగ్యానాయక్, ఏవో రెహనా, డాక్టర్ శాలిని, సీనియర్ అసిస్టెంట్ ముస్తఫా, ఆర్ఐ నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'భూభారతి' అమలు చేస్తాం

- 'ధరణి'తో నష్టపోయిన రైతులందరికీ న్యాయం
- చందంపేటను పైలెట్ మండలంగా ఎంపిక చేస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



చందంపేట మండలంలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

దేవరకొండ/చందంపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): 'భూభారతి' చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని, ధరణితో నష్టపోయిన రైతులందరికీ న్యాయం చేస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం చందంపేట మండల కేంద్రంలో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని నాలుగు మండలాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని జూన్ 2 నుంచి ఇక్కడి భూసమస్యలన్నీ శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. చందంపేటను పైలెట్ మండలంగా ఎంపిక చేస్తామన్నారు. సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వలేదని కంభాలపల్లి, పొగిళ్ల, తెల్‌దేవరపల్లి గ్రామాలకు చెందిన నిర్వాసితులు, రైతులు మంత్రి దృష్టికి....

- మిగతా 7వ పేజీలో...

గిరిజనుల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి



గిరిజనుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణిని ఏర్పాటు చేసి రైతులను మోసం చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చి భూసమస్యలన్నీ పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

- ఎమ్మెల్సీ శంకర్‌నాయక్


బ్లాక్‌లో ఉన్న ఆరు గ్రామాల్లో సమస్యల పరిష్కారం



2027లో వచ్చిన ధరణిలో చందంపేట మండలంలోని ఆరు గ్రామాలు బ్లాక్‌లో ఉన్నాయని, దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, భూభారతితో ఈ సమస్యకు పరిష్కారం చూపుతున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. భూభారతి ద్వారా తహసీల్దార్ మండల కేంద్రంలోనే అన్ని సమస్యలు 70శాతం పూర్తవుతాయని అన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నీ పరిష్కరించుకోవాలని రైతులను కోరారు.

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

భూసమస్యలన్నీ పరిష్కరించాలి



చందంపేట మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికచేసి భూసమస్యలన్నీ పరిష్కరించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో రైతుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. భూభారతితో డీఫారెస్ట్, అసైన్డ్ భూముల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పూర్తయితే దేవరకొండ నియోజకవర్గంలోని 1.50లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. రూ.1,800కోట్లను డిండి ప్రాజెక్టు నిర్మాణ పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు.

- ఎమ్మెల్యే బాలునాయక్

బాధితులకు సత్వర న్యాయం చేయాలి



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

ఎస్పీ శరత్‌చంద్రపవార్

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పనిచేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 30మంది నుంచి ఎస్పీ ఫిర్యాదులు తీసుకొని వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు పోలీస్‌శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. బాధితుల సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా, చట్టపరంగా న్యాయం జరిగేలా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారుడికి పోలీస్‌శాఖపై భరోసా కల్పించాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరించాలన్నారు.

బీఆర్ఎస్ అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

నల్లగొండ టౌన్, నల్లగొండ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఈ నెల 27న నిర్వహించే రజతోత్సవ సభలో ఆ పార్టీ అధ్యక్ష పదవిని బీసీలకు ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం బీసీ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీని అధ్యక్షుడిగా నియమిస్తేనే 2028లో ఆ పార్టీ అధికారంలోకి వస్తుందని, లేదంటే ప్రతిపక్ష హోదా కూడా దక్కదన్నారు. బీఆర్ఎస్ 11 సార్లు సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తే అన్నిసార్లు కేసీఆరే అధ్యక్షుడయ్యారన్నారు. జానాభాలో అరశాతం కూడా లేని వెలమ సామాజికవర్గానికి చెందిన కేసీఆర్ 11 సార్లు ఎలా అధ్యక్షుడు అవుతారని ప్రశ్నించారు. ఈసారైనా బీసీలకు అధ్యక్ష పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను సీఎం చేసుకోకపోవడం ప్రజల దురదృష్టమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పడం విడ్డూరంగా ఉందని, అరశాతం లేని వారిని రెండు సార్లు ముఖ్యమంత్రిని చేశామని, ఇంకా ఎన్ని సార్లు చేయాలని ప్రశ్నించారు. బీసీలపై కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ ఉద్యమంలో అమరులైన బీసీలకు చెందిన కుటుంబాలకు అధ్యక్ష పదవి కట్టబెట్టాలన్నారు. బీసీల త్యాగాలతో బీఆర్ఎస్ పుట్టిందని, కేసీఆర్ ఫాంహౌస్‌ను వీడి బీసీ ఉద్యమాన్ని చూడాలన్నారు. అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పిన బీజేపీ ఎన్నికల అనంతరం ఆ పార్టీ ఫ్లోర్‌లీడర్‌గా బీసీని ఎందుకు నియమించలేదని ప్రశ్నించారు. బీజేపీ కూడా రాష్ట్ర అధ్యక్ష పదవిని బీసీలకు కేటాయిస్తేనే రాష్ట్రంలో ఆ పార్టీకి మనుగడ ఉంటుందన్నారు. రెండు రోజుల్లో హైదరాబాద్‌లో సెమినార్ నిర్వహించి ఈ రెండు పార్టీల కులరంగును బయటపెడతామన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు నేలపట్ల సత్యనారాయణ, నల్ల సోమమల్లయ్య, నకిరేకంటి కాశయ్యగౌడ్, చిక్కుళ్ల రాములు, చొల్లేటి రమేష్, బూడిద మల్లికార్జున్, జిల్లా ఆదినారాయణ, గంజి భిక్షమయ్య, గుండా కోటప్ప, అంజయ్య, లింగస్వామి, పాల్గొన్నారు.

నేడు అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష

మిర్యాలగూడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ అధికారులతో మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. పట్టణంలోని టీఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో మిర్యాలగూడ, నకిరేకల్, దేవరకొండ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి ఈ సమావేశం నిర్వహించనున్నారు. సమావేశం మధ్యాహ్నం 2.30 నుంచి 4.30గంటల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు.

ఆరు అడుగులకు శాలిగౌరారం ప్రాజెక్టు నీటిమట్టం

శాలిగౌరారం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండు వేసవిలో శాలిగౌరారం ప్రాజెక్టులోకి వరద వచ్చి చేరుతోంది. 20 రోజుల వరకు డెడ్‌స్టోరేజీ వద్ద ఉన్న ప్రాజెక్టులోకి మూసీనది నుంచి నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం సోమవారం సాయంత్రం వరకు ఆరు అడుగులుగా నమోదైంది. ఇటీవల హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి వచ్చే వరదతో మూసీనది ప్రవహిస్తోంది. రామన్నపేట మండలం పల్లివాడ మూసీ ఆనకట్ట వద్ద ఉన్న ఫీడర్ ఛానల్ ద్వారా శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21 అడుగులకు 6అడుగుల మేర నీరుంది.



పుడమితల్లికి పుట్టెడు కష్టాలు

● సకల జీవులకు ప్రాణాధారం భూమి

● ఎరువులు, ప్లాస్టిక్‌తో భూసారం కలుషితం

పంచ భూతాల్లో ప్రథమమైన భూతల్లి బోరున విలపిస్తోంది. ప్రపంచ మానవాళికి, జీవ పరిణామ అభివృద్ధికి దోహదమైన పుడమి తల్లికి పుట్టెడు కష్టాలు మొదలయ్యాయి. జీవ కణజాలానికి ఆధారమైన పంచ భూతాలైన భూమి, గాలి, నీరు, నిప్పు, ఆకాశం కాలుష్యం కోరల్లో చిక్కుకుని జీవ వైవిధ్యానికి ఆటంకం కలిగేలా మానవుడు వ్యవహరిస్తున్న తీరుతో ధరణి అలమటిస్తోంది. అభివృద్ధి వైపు పయనించే మానవ వ్యవస్థ తీరుతో మూగ జీవులు, ధరిత్రి కలుషితమై భవిష్యత్తు జీవ వైవధ్యానికి ప్రశ్నార్థకంగా మారేలా మనిషి వ్యవహరిస్తున్న తీరుపై పునరాలోచన చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ/మిర్యాలగూడ రూరల్)

పర్యావరణ పరిరక్షణ దెబ్బతినడంతో వాతావరణంలో సమతుల్యం దెబ్బతింటోంది. రోజురోజుకూ భూవాతావరణం వేడెక్కిపోతోంది.ఆధునిక సాంకేతికరణ పెరుగుతూ నూతన ఆవిష్కరణలు చేపడుతున్నా పుడమి చల్లారక పోగా ఇంకా రాజుకుంటోంది. నియంత్రణ లేకుండా సహజ వనరుల వాడకం సమస్యను మరింత జఠిలంచేస్తోంది. మనిషి స్వార్థంతో అవసరాలకు మించి పచ్చని అడవులను, నదీపరివాహక ప్రాంతాల్లోని నీటిని కాలుష్యం



ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయిన నల్లగొండ జిల్లాకేంద్రం పానగల్‌లోని మురుగుకాల్వ

చేస్తున్నారు. దీంతో పాటు ఇసుక తవ్వకాలతో భూగర్భజలాలు అడుగంటి నీటికొరత నెలకొంటుంది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పరిసరాల్లోని రైస్‌మిల్లుల ద్వారా వచ్చే కాలుష్యంతో ఇక్కడి వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో పాటు భూగర్భజలాలు కలుషితమవుతున్నాయి. కాలుష్యనియంత్రణ చేపట్టాల్సిన అధికారులు మామూళ్లతో చూసీచూడనట్లుగా ఉంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

రూ.కోట్లు వృథా

ప్రభుత్వాలు పచ్చదనాన్ని పెంచేందుకు ప్రవేశపెట్టిన పథకాల ద్వారా కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టి మొక్కలను నాటినా నిరుపయోగంగా మారుతున్నాయి. ఒక ఏడాది నాటిన మొక్కలు మరో ఏడాదికి కనుమరుగవుతున్నాయి. ఉపాధిహామీ పథకం అధికారుల కాకి లెక్కలు మాత్రమే కనిపిస్తున్నాయి కానీ ఒక్క మొక్క దర్శనమివ్వడం లేదు. ఆదర్శ గ్రామంగా నిలిచిన శ్రీనివాస్‌నగర్ గ్రామంలో పచ్చదనాన్ని మెరుగుపరిచి సుందరంగా తీర్చిదిద్దినా అక్కడి ఓ మిల్ యజమాని అవసరానికి అనుగుణంగా 5కిలోమీటర్ల మేర పచ్చని చెట్లను సోమవారం వేర్ల సహా పెకిలించి వేయడంపై స్థానికులు సంబంధిత విద్యుత్ లైన్‌మన్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ధరిత్రి వారోత్సవాల్లో భాగంగా

పర్యావరణ ప్రేమికులు ధరిత్రి వారోత్సవాలు ఇప్పటికే మొదలుపెట్టారు. నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మూల్యాంకన సమయంలో 600మంది అధ్యాపకులకు ధరిత్రిని కాపాడుకునే విధానంపై సిరిధాన్యాలు, గోధారిత వ్యవసాయ పంటలను, ప్లాస్టిక్ ఉత్పత్తులు వాడేసిన తరువాత చేయాల్సిన విధానం, చేనేత, ఖాదీ వస్త్రాలపైన, ఇంకుడు గుంతలు, ఇంటి పంట గురించి, కంపోస్టు ఎరువుల గురించి వివరించారు. స్టీలు బాటిళ్ల వాడేవారిని అభినందించి బహుమానాలూ అందజేస్తా. ప్రతీ లెక్చరర్ విధిగా పర్యావరణ విద్యమానవతా విలువలపై పాఠాలు బోధించి విద్యార్థుల్లో పర్యావరణ స్పృహను పెంచేలా ఈ వారోత్సవాల్లో కృషి చేయనున్నారు. అదేవిధంగా రేలా చెట్ల పూలను, ఆ విత్తనాలను సేకరించి అవగాహన కల్పిస్తున్నారు.

● భూసారాన్ని మింగేస్తున్న అనర్థాలు

● ఒక ప్లాస్టిక్ కవర్ భూమిలో కలిసిపోయేందుకు చాలా ఏళ్లు పడుతుంది. 5 మిల్లీమీటర్ల తక్కువ పరిమాణంలోని కణాలు భూమిసారాన్ని దెబ్బతీస్తాయి. నాణ్యతను కోల్పోయేలా చేసి విషపూరితంగా మారుస్తాయి.

● వ్యవసాయంలో విచ్చలవిడిగా రసాయనాలు, ఎరువుల వాడకం కూడా ఇటీవల ఎక్కువైంది. దీంతో భూమిలోని సహజసిద్ధంగా భూసారానికి అవసరమయ్యే క్రిమికీటకాలు నాశనమవుతున్నాయి. ఏళ్లకు ఏళ్లు ఎరువుల వాడకంతో భూసారం తగ్గి, ఆహార నాణ్యత కూడా దెబ్బతింటోంది.

● భూమిలో సహజ వనరులైన గనులు, పెట్రో, బంగారం వంటి వాటి కోసం విచ్చలవిడి తవ్వకాలు భూమిలో మార్పులకు కారణమవుతున్నాయి. ఒక్కోసారి భూపొరలు దెబ్బతిని సునామీల రాకకు కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

ఆరుశాతమే అడవి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 14.25లక్షల హెక్టార్ల విస్తీర్ణం ఉండగా అందులో ఆరు శాతం మేరకే అడవులున్నాయి. అంటే 83.859 హెక్టార్లలో మాత్రమే అడవి విస్తరించి ఉంది. ఇది కూడా గుట్టలు, బండలు రాళ్లతో కూడి ఉంది. అటవీ విస్తీర్ణంలో 41,569హెక్టార్లు నాగార్జునసాగర్ కేంద్రంగా ఉన్న వన్యప్రాణి విభాగ పరిధిలో ఉంది. అదేవిధంగా నల్లగొండ అటవీ ప్రాంత పరిధిలో 42,290 హెక్టార్లు ఉంది. సూర్యాపేట జిల్లా పరిధిలోని కృష్ణా పరివాహక ప్రాంతంలో కొంతమేర అటవీప్రాంతం ఉండగా, యాదాద్రిభువనగిరి జిల్లాలో రాచకొండ గుట్టలు ఉన్నాయి.

● చెట్టు నీడనే...



గూడూరులో చెట్టును తొలగించకుండా ఏర్పాటు చేసిన హోటల్

మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామంలో హైవేకు పక్కనే ఉన్న ఓ చిన్నహోటల్ వద్ద వ్యాపార సముదాయం కోసం షట్టర్లు ఏర్పాటుచేసినా అక్కడ ప్రదేశంలో దశాబ్దాల క్రితం ఉన్న వేపచెట్టును తొలగించకుండా నిర్మాణాన్ని చేపట్టి చల్లదనాన్ని ఆస్వాదిస్తున్నారు. అదేవిధంగా ఆలగడప గ్రామంలో మట్టి మనిషి వేనేపల్లి పాండు రంగారావు ఇంటి ఆవరణలో వేప చెట్లను తొలగించకుండా గదులను ఏర్పాటుచేసి తన ఆలోచన విధానాన్ని, చెట్ల సంరక్షణపై అబిమానాన్ని వ్యక్త పరిచేలా తనవంతు కృషి చేశారు. దీనిపై పలువురు ప్రకృతి ప్రేమికులు అబినందనలు తెలుపుతున్నారు.



ఆలగడపలో మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు ఇంటి ఆవరణలో చెట్టును సంరక్షిస్తూ ఏర్పాటుచేసిన గదులు.



వృక్షోరక్షతి రక్షితః




చెట్టును మనం రక్షిస్తే చెట్టు మనని రక్షిస్తుందనే నానుడికి చక్కని ఉదాహరణ నల్లగొండ జిల్లా మిర్యాలగూడ డీఎస్పీ కార్యాలయంలోని వేపచెట్టు. కార్యాలయాన్ని విస్తరించే క్రమంలో ఇక్కడి వేప చెట్టును నరికివేయకుండా దాని చుట్టూ పోర్టికోను నిర్మించారు. ఎత్తుగా పెరిగిన చెట్టు భవనంపై గొడుగులా విస్తరించి కార్యాలయానికి చల్లని నీడను ప్రసాదిస్తోంది. ఆ చెట్టు సమీపం లోనే పిర్యాదుల, వినతుల, రక్షణ కోసం అక్కడికి వచ్చే వారు వేచి ఉండేందుకు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయడంతో శాఖలు విస్తరించిన వేపచెట్టు మరో చెట్టుతో కలిసిపోయి ఎండపొడ లేని చల్లని నీడ పరుస్తోంది. దీంతో కార్యాలయానికి వచ్చే వారు అలసటను మరిచి కొంతసేపు ఆహ్లాదంగా బెంచీలపై గడుపుతుంటారు.

నేను మీ భూమాతను...

జనులారా... నేను మీ భూమాతను. ధరిత్రి, పృథ్వీ, అవని ఇలా ఎన్నో పేర్లతో నన్ను మీరు పిలుస్తుంటారు. ఎన్నో యుగాలకు నేను సాక్షీభూతాన్ని. నాలో ముప్పావంతు నీరే... కేవలం నేను పావంతు భాగాన్నే. ఆ పావంతును కూడా క్రమంగా అదృశ్యం చేస్తున్నారు మీరు. మీ అవసరాల కోసం నా గర్భాన్ని విచ్ఛిత్తి చేస్తున్నారు. నన్ను కాంక్రీట్ జంగిల్‌గా మారుస్తున్నారు. నాపై ఉండే పచ్చని వాతావరణాన్ని మాయంచేస్తున్నారు. కాలుష్యాన్ని కొనితెస్తున్నారు. బోరు బావుల పేరిట నా తనువును నిలువునా తోడేస్తున్నారు. నా గుండెల్లో గునపాలు గుచ్చుతున్నారు. ప్రకృతి సంపదను కాదని హానికరమైన కృత్రిమ సంపదను దరిచేర్చుకుంటున్నారు. ప్లాస్టిక్‌ను వాడుతూ నన్ను కాలుష్య కోరలతో కాటేయిస్తున్నారు. స్వచ్ఛమైన మట్టి వాసన ఉట్టిపడే నాలో ఎరువులు, క్రిమిసంహారక మందులు చల్లుతూ నన్ను మీరే 'కాలకూట' విషపూరితం చేస్తున్నారు. ప్లాస్టిక్ భూతాలను వదిలి ప్రకృతిని నాశనం చేసుకుంటున్నారు. టన్నులకొద్దీ వ్యర్థాలను నింపి జలసంపదను కలుషితం చేస్తున్నారు. పర్యావరణం పచ్చదనం పేరిట మొక్కలు నాపై మొక్కలు నాటుతారు, నాగరికతకు మారుపేరైన రోడ్ల పేరిట చెట్లను నరుకుతారు. మీ ఆరోగ్యానికి నేనో చిరునామా అని తెలిసినా ఆసుపత్రికే పరిగెత్తుకుంటూ వెళ్తారు. ఆకాశానికి నిచ్చెనలు వేస్తూ భూమ్మీద ఉన్నామన్న సంగతి మరుస్తున్నారు. కూర్చున్న చెట్టుకొమ్మను నరుకుతున్న అమాయకత్వంలా ఉంది మీ ప్రవర్తన. సహనానికి నేనే ఉదాహరణ. విలయానికీ నేనే సోదాహరణ. ఏమో గుండ్రంగా ఉన్న నేను మీ వికృత చేష్టలతో రూపం మారుతానో, మీరు మారుస్తారో. ధరిత్రిని నేను ఎవరికి చెప్పుకోవాలి నా ఆర్తిని మీకు తప్ప!

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)



ప్లకార్డుతో రావుల శ్రీనివాస్

పర్యావరణంపై చైతన్యపరుస్తూ

ప్రైవేట్ ఇనిస్టిట్యూట్ నిర్వహిస్తున్నా. ఉదయం, సాయంత్రం చదువు చెబుతూ మధ్యాహ్నం మొక్కలు నాటుతా. ఇంట్లో నర్సరీలో, రోడ్ల వెంబడి మొక్కలు నాటుతున్నా. ఇటీవల ఫ్లైఓవర్ వద్ద నుంచి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వరకు మొక్కలు నాటాను. ఐదేళ్లలో 300 మొక్కలు నాటాను. నేటి తరానికి 'సేవ్ ట్రీస్' అన్నది నినాదంగా మారాలి. అందుకోసం 'సేవ్ ట్రీస్' ప్లకార్డు చేతిలో పట్టుకుని కొన్ని మొక్కలు సంచిలో పెట్టుకుని అక్కడక్కడా పట్టణ కూడళ్ల వద్ద నిలుచుంటా. ఎవరైనా దగ్గరకు వస్తే మొక్క నాటమని ఇస్తా. ఇది నిరంతర ఉద్యమంగా ప్రతి పౌరుడు కొనసాగించాలన్నదే నా ఆకాంక్ష.

రావుల శ్రీనివాస్, ప్రైవేట్ ఉపాధ్యాయుడు, నందిపాడు.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

రోజుకు ఐదు పండ్ల మొక్కలు

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)



నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఏపీలింగోటం జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు ఆదిమళ్ల మణిరాజ్ 'ఇది నా చెట్టు' అనే వినూత్న నామకరణంతో మొక్కల పెంపకంపై ప్రజలను చైతన్య పరుస్తున్నారు. ప్రజలతో మొక్కలు నాటించడంతో పాటు సంరక్షణకు 'ఇది నాచెట్టు' అని నామకరణం చేయిస్తున్నాడు. 2025 జనవరి 1 నుంచి ఇప్పటి వరకు రోజుకు 5 పండ్ల మొక్కలను నాటే కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తున్నాడు.

ప్రకృతి వ్యవసాయంతో భూసార పరిరక్షణ

(ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)



సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం మాధవరాయనిగూడెం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్ఐ వల్లపుదాసు వెంకటేశ్వర్లు 20ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు. అధికదిగుబడుల కోసం రైతులు రసాయనిక, క్రిమిసంహారక మందులు వాడుతున్న వేళ ఏమందులు వాడకుండా 20ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. జీవామృతాన్ని వినియోగిస్తూ ఎకరానికి 30బస్తాలపైనే దిగుబడి సాధిస్తున్నారు. భూమి సాంద్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి రైతుపైనా ఉందని, క్రిమిసంహారక మందుల వాడకాన్ని తగ్గించాలని రైతులకు వెంకటేశ్వర్లు సూచిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణలో రెడ్‌క్రాస్

(ఆంధ్రజ్యోతి-మోత్కూరు)



పర్యావరణ పరిరక్షణను రెడ్‌క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ సామాజిక బాధ్యతగా గుర్తించింది. ధరిత్రి దినోత్సవం నేపథ్యంలో సంస్థ చేస్తున్న కార్యక్రమాలను రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. ప్రతి యేటా మొక్కలు పంపిణీ చేసి, మొక్కలు నాటిస్తున్నామన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై మోత్కూరు, భువనగిరితో పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పదేళ్లుగా మోత్కూరులో వినాయక చవితి పండుగ రోజు దాతల సహకారంతో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నామన్నారు. హోలి పండుగ రోజు పూలతో తయారుచేసిన రంగులు చల్లుకోవాలని యువతకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఇంటి ఆవరణలో ఐదు వేల మొక్కలు

నల్లగొండ జిల్లా హాలియాకు చెందిన నరేష్ ఫౌండేషన్, కంప్యూటర్స్ చైర్మన్ గొట్టిముక్కల నరేష్ పర్యావరణ పరిరక్షణ కోసం తమవంతుగా ఇంటి ఆవరణలో ఐదు వేల మొక్కలు నాటి వాటి రక్షణ కోసం కుటుంబమంతా శ్రమిస్తున్నారు. పట్టణంలో నివసిస్తున్నా గ్రామీణ ప్రాంతంలోని ఇళ్లను తలపించేలా వివిధరకాల మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. వనజీవి రామయ్య స్ఫూర్తితో మొక్కల పెంపకంలో భాగస్వాములు కావాలనే కాంక్షతో పనిచేస్తున్నారు. ఇంటి ఆవరణలో చాలామంది సీసీ వేయడం, బండలు వేయడం చేస్తుంటారు. అలా కాకుండా మొక్కలు నాటారు. కుటుంబం అంతా ఇష్టంతో మొక్కలను పెంచుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-హాలియా)



ఇక నుంచి శుభకార్యాలకు ప్లేట్ తీసుకెళ్తా

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)



ధరిత్రి దినోత్సవం సందర్భంగా నేనొక సంకల్పం తీసుకుంటున్నా. పర్యావరణానికి హానితలపెట్టే ప్లాస్టిక్ వస్తువుల స్థానంలో పర్యావరణ హిత వస్తువులను వాడేందుకు ప్రయత్నిస్తా. భోజనం చేసే కాగితం ప్లేటు, ప్లాస్టిక్ గ్లాసుకు బదులుగా పర్యావరణానికి హాని కలిగించని పద్ధతులను పాటించాలనుకుంటున్నా. సామాజిక కార్యకర్తగా ప్రజలకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించడానికి చైతన్యం తేవడానికి ముందు ఆ పద్ధతిని పాటించాలని భావిస్తున్నా. అందుకే ధరిత్రి దినోత్సవం రోజు నుంచి తప్పనిసరై భోజనం చేయాల్సిన శుభకార్యాల్లో సంకోచించకుండా నా వెంట స్టీలు ప్లేటు, గ్లాసు తీసుకెళ్లాలని అనుకుంటున్నా. ఇది చాదస్తం కాదు. చైతన్యం తెచ్చే విధానమని నా అభిప్రాయం. ముందు నేను ఆచరించి తర్వాత అందరిలో పర్యావరణ పరిరక్షణ అవగాహన సదస్సులు నిర్వహిస్తా.

గూడూరు అంజిరెడ్డి, సామాజిక కార్యకర్త

సైకిల్‌పైనే వెళ్తుంటా..

(ఆంధ్రజ్యోతి-భువనగిరి రూరల్)



పర్యావరణ పరిరక్షణకు ప్రతి రోజూ కృషి చేస్తా. నిద్రలేవగానే మొక్కలకు అడుగు బాగాన(పాదు) వద్ద ఎండిన ఆకులు కప్పి నీటిని పోస్తా. ఇంట్లోని తడి చెత్తను వేరుచేసి కంపోస్టు ఎరువుగా తయారుచేస్తా. పొడిచెత్తను మునిసిపాలిటీ వారికి బుట్టలో అందజేస్తా. ప్లాస్టింగ్ బ్యాగు వాడడంపై విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించేవాడిని. అదేవిధంగా మార్కెట్‌కు వెళ్లేటప్పుడు మోటారు సైకిల్ ఉన్నప్పటికీ సైకిల్‌పై వెళ్తా, నా వంతుగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నా. ఇతరులకు కూడా కాలుష్య నివారణపై అవగాహన కల్పిస్తాను.

ఎల్లంకి పురుషోత్తంరెడ్డి, ఉమ్మడి జిల్లా వన నేస్తం అవార్డు గ్రహీత, భువనగిరి

ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి

(ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్)



అడవులు అంతరించిపోవడం వల్ల అనేక సమస్యలు ఎదురవుతాయి. రోజురోజుకూ చెట్లను నరికి వేయడం వల్ల వాతావరణంలో అనేక మార్పులు వస్తున్నాయి. వర్షాలు పడక భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. రాచకొండ పర్యావరణ పర్యాటక పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అడవిని కాపాడడానికి, పర్యావరణ పరిరక్షణకు మావంతు ప్రయత్నం చేస్తున్నాం. అడవిలోని చెట్లను నరికి వేయకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. కొత్త మొక్కలను పెంచాలి, అడవులను తయారుచేయాలని చెబుతున్నాం. ధరిత్రి దినోత్సవం సందర్భంగా రానున్న రోజుల్లో మరింత కృషి చేస్తా.

సూరేపల్లి వెంకటేశం, చౌటుప్పల్

ప్లాస్టిక్‌రహిత వస్తువులనే వినియోగిస్తా

(ఆంధ్రజ్యోతి-కోదాడ)



ధరిత్రి దినోత్సవానికి పురస్కరించుకుని ప్లాస్టిక్ రహిత వస్తువులనే వినియోగిస్తా. ప్లాస్టిక్ కవర్లకు బదులు జనపనార, వస్త్ర సంచులను, స్టీల్ గిన్నెలు, మట్టి పాత్రలను వాడుతాను. అదేవిధంగా ఇంటిలో ఏదైనా శుభ కార్యం జరిగితే ఫ్లెక్సీలకు బదులు క్లాత్ బ్యానర్లను, పేపర్ షీట్స్ వినియోగిస్తా. ఆకు విస్తర్లను ఉపయోగిస్తా. దీపావళీ పండుగ సందర్భంగా పర్యావరణ రహిత టపాసులు కాలుస్తా. వారంలో రెండు రోజులైనా బైక్‌కు బదులు సైకిల్ వాడుతా. ఇంకుడు గుంతల నిర్మాణానికి, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టడంతో పాటు చెట్ల రక్షణతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తా.

కొల్లు లక్ష్మీనారాయణ, కోదాడ

పర్యావరణ పరిరక్షణ ఒక జీవన విధానం



పర్యావరణ పరిరక్షణ ఒక జీవనం విధానం. ప్లాస్టిక్‌ను ఉపయోగిస్తే దానిని డిస్పోజ్‌తో పాటు రీసైక్లింగ్‌పై అవగాహన కల్పిస్తా. భూమిని కాపాడుకోవడం, పర్యావరణ పరిరక్షణను కాపాడుకోవడానికి మొక్కలు నాటడం, సీడ్ బాల్స్‌ను గుట్టలపైన, అటవీ ప్రాంతంలో చల్లడం చేయాలి. ఇంటి పంటతో పాటు సోలార్ విద్యుత్ మీద అవగాహన పెంచుకోవాలి. ప్రకృతి వ్యవసాయం, దేశీయ పంటల సాగు, సిరిధాన్యపు పంటలు, వంటకాలు, పర్యావరణం, ఆరోగ్యానికి చేసిన మేలు గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరముంది. పర్యావరణ పరిరక్షణ కోసం చేనేత ఖాదీ వస్త్రాలు ధరించాలి. అదేవిధంగా చేతివృత్తులు పర్యావరణ పరిరక్షణకు ఏవిధంగా దోహదం చేస్తాయనే దానిపై ప్రతి ఒక్కరికీ వివరించి ప్రోత్సహించాలి. వినాయకుల పండుగ, దుర్గామాత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పర్యావరణ హితంగా పండుగలు జరుపుకునేలా అవగాహన కల్పించేలా ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతాను.

సురేష్‌గుప్తా, పర్యావరణ ప్రేమికుడు, నల్లగొండ

భారీ వృక్షాలను సంరక్షించాలి

రోడ్డు విస్తరణ పనులు చేపట్టే సమయంలో భారీ వృక్షాలను తొలగించకుండా పచ్చదనాన్ని కాలుష్య నియంత్రణ చేపట్టేలా తగినఏర్పాట్లు ప్రభుత్వం చేపట్టాలి. కాంట్రాక్టర్ల అవసరాల కోసం చెట్లను నరికి వ్యాపార లబ్ధి పొందడం సరికాదు. పదేళ్ల క్రితం చల్లని నీడనిచ్చే మిర్యాలగూడ పట్టణంలో, హైవేరోడ్ల వెంట ఉన్న మొక్కలను నరికి విక్రయించుకున్న కాంట్రాక్టర్లు వాటి స్థాయిలో మొక్కల పెంపకం చేపట్టకపోవడం బాధాకరం. అధికారులు నిర్లక్ష్య వైఖరిని వీడి భవిష్యత్తు తరాలకోసం మొక్కల పెంపకానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి.

మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు

కుక్కల దాడిలో 45 గొర్రెలు మృతి

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కుక్కలు దాడిలో 45 గొర్రెలను మృతి చెందాయి. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని సింగారం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన జెట్ట అయిలయ్య తనకున్న 50 మేకలను రోజు మాదిరిగానే ఆదివారం తన గొర్రెలను మేతకు తోలుకెళ్లాడు. తిరిగి సాయంత్రం వ్యవసాయ బావి వద్ద ఏర్పాటు చేసుకున్న గొర్రెల పాకలో తోలి ఇంటికి వెళ్లాడు. అదే రాత్రి గ్రామంలో తిరుగుతున్న నాలుగు కుక్కలు అయిలయ్య గొర్రెల పాకలో ఉన్న గొర్రెల మందపై దాడి చేసి 45 గొర్రెలను చంపేశాయి. సోమవారం తెల్లవారుజామున అయిలయ్య గొర్రెల దొడ్డి(పాక) వద్దకు వెళ్లే వరకు గొర్రెలపై దాడి చేస్తున్న కుక్కలను చూసి భయపడ్డాడు. వెంటనే ఇంటికి ఫోన్ చేయడంతో పాటు గ్రామస్థులకు సమాచారం అదించాడు. వారంతా అక్కడి వచ్చి కుక్కలను తరిమారు. పాకలోకి వెళ్లి చూడగా 32 పెద్ద గొర్రెలు, 13 పిల్ల గొర్రెలు చనిపోయి ఉన్నాయి. తన జీవనాధారమైన గొర్రెలు చనిపోవడం చూసిన అయిలయ్య బోరున విలపించాడు. మండల పశువైద్యాధికారి వల్లాల సంతోష్‌కుమార్, ఆర్లై వెంకటేశ్వర్లు చనిపోయిన గొర్రెలకు పంచనామా నిర్వహించారు. ఈ ప్రమాదంలో రూ.4.30లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలలోనే ఎక్కువ శాతం జరుగుతున్నట్లు తెలిపారు.

శతాధిక వృద్ధుడు మృతి


భూమయ్య (ఫైల్ ఫొటో)

రాజాపేట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా రా జాపేట మండలం సింగారం గ్రామానికి చెందిన వంగరి భూమయ్య (105) అనే వయోవృద్ధుడు అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఆయన గ్రామంలోనే కురు వృద్ధుడు. భూమయ్యకు 6ఎకరాల భూమి ఉండగా కొంతకాలం వరకు వ్యవసాయం పనులు నిర్వహించారు. ఆయనకు ఇద్దరు కుమారులు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. 20 సంవత్సరాల క్రితం క్రితం తన చిన్న కుమారుడు నాధం ఆయన భార్య అనారోగ్యంతో మృతి చెందారు. వారికి ఒక కుమార్తె ఉంది. భూమయ్య భార్య లక్ష్మి ఐదేళ్ల క్రితం పక్షవాతానికి గురై మంచాని కే పరిమితమవడంతో ఆయనే సేవలందించాడు. అనారోగ్య సమస్యల తో రెండేళ్ల క్రితం ఆమె మృతి చెందింది. అప్పటి నుంచి పెద్ద కుమారుడు లక్ష్మీనారాయణ వద్దే ఉంటున్నాడు. నిన్న మొన్నటి వరకు ఆయన పనులు ఆయనే చేసుకుని ఆరోగ్యంగా ఉన్నాడు. రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురై సోమవారం మృతి చెందాడు. ఆయనకు కుమారు లు, కుమార్తెలు, మనవళ్లు, మనవరాళ్లు అందరూ కలిపి 100 మంది వ రకు ఉంటారు. భూమయ్య మృతిపట్ల గ్రామస్థులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. గ్రామంలోనే కురు వృద్ధుడని, ఆరోగ్యంగా ఉంటూ ఆప్యాయంగా అందరినీ పలుకరించేదని గ్రామస్థులు తెలిపారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

సంస్థాన్‌నారాయణపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): భర్త, అత్తమామల వేధింపులు తాళలేక ఓ వివాహిత నీటిసంపులో పడి మృతి చెందింది. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాక గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన జంజనం మల్లికార్జున్‌కు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాగమణి (25)తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరిలో స్వర్ణకారుడిగా భార్యాభర్తలు జీవనం సాగిస్తున్నారు. మల్లికార్జున్ తల్లిదండ్రులు పుట్టపాక గ్రామంలోనే నివాసముంటున్నారు. నాగమణికి సంతానం కలగలేదని కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. స్వగ్రామం పుట్టపాకలో నూతన ఇల్లును నిర్మిస్తుండటంతో ఇటీవల గ్రామానికి వచ్చారు. సంతానం లేదని అత్తమామలు, భర్త వేధింపులకు గురిచేయడంతో మనస్థాపం చెందిన నాగమణి సోమవారం ఉదయం నీటి సంపులో దూకి మృతి చెందింది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జగన్ తెలిపారు.

తాగి వాహనాలు నడిపితే జైలు

సూర్యాపేటక్రైం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష, జరిమానా విధించనున్నట్లు సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ ఆర్.సాయిరాం అన్నారు. సూర్యాపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో పట్టుబడిన 13 మందిని సోమవారం సూర్యాపేట ద్వితీయ శ్రేణి కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఎస్ఐ సాయిరాం మాట్లాడుతూ కోర్టులో ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి రమణ మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి రెండు రోజులు జైలు, ఒకరికి ఒక రోజు జైలుశిక్ష విధించారు. అంతేకాక ఒక్కొక్కరికి రూ.2వేల జరిమానా విధించినట్లు తెలిపారు. అదే విధంగా మిగిలిన తొమ్మిది మందికి ఒక్కొక్కరికి వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు వివరించారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. ప్రతీరోజూ డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

ఫిట్స్‌తో ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి

● సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్‌లో ఘటన


శ్రీనివాస్ (ఫైల్ ఫొటో)

పెన్‌పహాడ్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యో తి): డ్రైవింగ్ చేసే సమయంలో ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ టైర్ కింద పడి ఓ డ్రైవర్ మృతి చెందాడు. ఈ ప్రమాదం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం ఎల్లా రం గ్రామానికి చెందిన రైతు జూలకంటి లక్ష్మారెడ్డికి పెన్‌పహాడ్ మండలం దోసపహాడ్ గ్రామంలో మూడు ఎకరాల పొలం ఉంది. పొలాన్ని కోత కోయించాడు. దీంతో నేరేడుచర్ల మండలం దాచారం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ గొడ్డెటి శ్రీనివాస్ (35) తీసుకొని పొలం వద్దకు వెళ్లాడు. పొలంలో ధాన్యాన్ని తన ట్రాక్టర్‌తో లోడ్ చేసి మిల్లుకు తరలించేందుకు వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో గొడ్డెటి శ్రీనివాస్‌కు ఫిట్స్ వచ్చింది. వెంటనే ట్రాక్టర్ ఇంజన్ టైర్ కింద పడటంతో అతనిపై నుంచి వెళ్లింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు శ్రీనివాస్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మృతిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ కె.గోపికృష్ణ తెలిపారు.

తిరునాళ్లకు ముస్తాబు


విద్యుత్ కాంతులో శుభవార్త దేవాలయం

- పెద్ద పండుగకు సిద్ధమైన శుభవార్త దేవాలయం
- మూడు రోజుల పాటు వార్షిక వేడుకలు
- హాజరుకానున్న పలువురు ప్రముఖ రాజకీయ నేతలు, పీఠాధిపతులు
- విద్యుత్‌కాంతుల్లో మఠంపల్లి శుభవార్త దేవాలయం చర్చి

మఠంపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): దక్షిణ తెలంగాణలోనే అతిపెద్ద చర్చిగా పేరుగాంచిన మఠంపల్లి శుభవార్త దేవాలయం 28 వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో వార్షిక మహోత్సవాలు ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించే ఈ వేడుకలకు శుభవార్త దేవాలయాన్ని ఆకర్షణీయమైన రంగులతో విద్యుత్ దీపాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. కృష్ణానది తీరాన వెలసిన శుభవార్త దేవాలయంలో మరియమాత భక్తులను కోర్కెలు తీరుస్తూ అలరారుతుంది. మరియమాత సన్నిధిలో ఎందరెందరో భక్తులు కులాలు, మతాలకతీతంగా సేద తీరుతూ, ప్రార్థిస్తూ ఆ తల్లి దీవెనలు పొందుతున్నారు. "ఈ లోకానికి రక్షకుడిని అందించిన తల్లి మన బాధలను, వ్యాధులను, ఇతర సమస్యలను తన కుమారుని ప్రార్థించి మన అవసరాలు తీర్చే తల్లి మరియతల్లి. ఆ తల్లి దీవెనలు పొందుటకు మిమ్ములను హృదయ పూర్వకముగా ఆహ్వానిస్తున్నామని సందేశం."

ఈ శుభవార్త దేవాలయం (మంగళవార్త చర్చి) 1968వ సంవత్సరంలో నిర్మించారు. పురాతన చర్చిని ఆధునిక హంగులతో నిర్మించేందుకు 1980 సంవత్సరంలో శంకుస్థాపన చేసి 1993వ సంవత్సరంలో పూర్తిచేశారు. అప్పటి వరకు మంగళవార్త చర్చిగా పిలవబడుతున్న దేవాలయాన్ని శుభవార్త దేవాలయంగా నామకరణం చేశారు. ప్రతీ సంవత్సరం ఏప్రిల్ 24, 25, 26 తేదీల్లో నిర్వహించుకునే ఈ మహోత్సవాన్ని గ్రామస్థులందరూ పెద్ద పండుగగా జరుపుకుంటారు. కుల, మతాలకతీతంగా గ్రామస్థులందరూ ఈ పెద్ద పండుగను ఘనంగా నిర్వహిస్తుంటారు. గ్రామంలోని క్రైస్తవ కుటుంబాలకు చెందిన ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల్లో ఉన్న బంధు మిత్రులందరు ఈ పెద్ద పండుగకు వస్తుంటారు.


చర్చి ప్రాంగణం

16 నుంచి 26 వరకు ఉత్సవాలు



శుభవార్త చర్చి మహోత్సవాలు ఈ నెల 16 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు విచారణ గురువు మార్టిన్ పసల సోమవారం తెలిపారు. దేవాలయ వార్షిక వేడుకల సందర్భంగా ప్రతీ రోజు ఉదయం 6 గంటలకు నవదిన జపములు, దివ్యబలిపూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 25వ తేదీన ఉదయం 9 గంటలకు శుభవార్త పండుగ సమిష్టి దివ్యబలిపూజను నల్లగొండ, ,గుంటూరు, ఖమ్మం పీఠాధిపతులు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 నుంచి ఒత్తుల సమర్పణ ప్రత్యేక పూజలు, సాయంత్రం 5గంటలకు ప్రత్యేకంగా అలంకరించిన రథంపై (తేరు) మరియమాత విగ్రహాన్ని వుంచి గ్రామ పురవీధులలో బాణసంచాలతో ఊరేగింపు నిర్వహిస్తారు. 26 తేదీ మంగళవారం ఉదయం 7 గంటలకు క్రైస్తవ కుటుంబాలలో మరణించి వారి కోసం దివ్యబలిపూజ (పెద్దల పూజ) నిర్వహించనున్నట్లు విచారణ గురువు పసల మార్టిన్ తెలిపారు. ఈవేడుకల సందర్భంగా శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి 29వతేదీ వరకు రెండుతెలుగు రాష్టాల స్థాయి ఎడ్ల పందేల బల ప్రదర్శన పోటీలను ఏర్పాటు చేసినట్లు యువజన సంఘం సభ్యుడు గాదె జయభరత్‌రెడ్డి తెలిపారు.

బెట్టింగ్‌కు పాల్పడిన నిందితుల అరెస్ట్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ మ్యాచ్ బెట్టింగ్‌కు పాల్పడిన పలువురు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ చరమందరాజు తెలిపారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను సీఐ వెల్లడించారు. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన పాన్‌షాప్ యజమాని షేక్ ఖలీముద్దీన్ అలియాస్ హలీమ్, షేక్ ఆయూబ్, తిరుమలశెట్టి రామ్మోహన్‌రావు, సామల నర్సింహారెడ్డి, హుజూర్‌నగర్ మండలం అమరవరం గ్రామానికి చెందిన పొట్టిపంగు కోటయ్య, విజయవాడలోని ఊర్మిళనగర్‌కు చెందిన పొట్టి కోటయ్య, మేళ్లచెరువు మండలం నల్లబండగూడెంకు చెందిన తొడేటి గోపీకృష్ణ, గరిడేపల్లి మండలం రాయినిగూడెంకు చెందిన వాడపల్లి నర్సింహారావు సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు వారి సెల్‌ఫోన్లలో పలు బెట్టింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఆ యాప్‌ల ద్వారా ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్, ఇంటర్నేషనల్ లెవల్‌లో జరిగే ఆటలపై బాల్ టూ బాల్, పవర్ ప్లే, మ్యాచ్ మొత్తానికి, బ్యాట్‌మెన్ ఎంత రన్స్, ఎంత చేస్తాడని ఆన్‌లైన్ లో బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. వీరందరూ ఉమ్మడిగా బెట్టింగ్‌కు పాల్పడుతూ వచ్చిన లాభాన్ని పంచుకుంటున్నారు. ఈ సంఘటనపై ఆదివారం మధ్యాహ్నం పంజాబ్ కింగ్స్ 11, రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు ఐపీఎల్ మ్యాచ్‌కు బెట్టింగ్ పెట్టాలని వీరందరూ పట్టణంలోని నల్లగొండ పాన్‌షాప్ వద్దకు చేరుకుని తొడేటి గోపీకృష్ణ, రామ్మోహన్‌రావు, వాడపల్లి నర్సింహారావులకు సెల్ ఫోన్లలో బెట్టింగ్ పెట్టడం రానందున వారు కోటయ్యకు డబ్బులు ఇచ్చి అతని ఐడీ ద్వారా బెట్టింగ్ పెట్టారు. వీరందరూ ఆన్‌లైన్‌లో బెట్టింగ్ కాస్తున్నారు. విశ్వసనీయ సమచాచారం మేరకు పోలీసులు వారందరినీ పట్టుకున్నారు. వీరిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి సోమవారం రిమాండ్ చేసినట్లు సీఐ చరమందరాజు తెలిపారు. వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, 3,400నగదు, బెట్టింగ్‌యాప్‌లో ఉన్న రూ.66,067 రూపాయలను ఫ్రీజ్ చేసినట్లు తెలిపారు. యువకులు డబ్బులు సులువుగా సంపాదించాలనే ఆశతో చెడు వ్యసనాలకు బానిసై బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు సీఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

● కారులో వెళ్తున్న భార్యాభర్తలు క్షేమం
● నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ వద్ద ఘటన


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కేతేపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై షార్ట్‌సర్క్యూట్‌తో ఓ కారు దగ్ధంకాగా, అందులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలు ప్రమాదం నుంచి త్రుటితో తప్పించుకున్నారు. సోమవారం నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ వద్ద ఈ సంఘటన జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.వెంకట్రావు హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. ఆయన భార్యతో కలిసి రెనాల్ట్ క్విడ్ కారులో సోమవారం విజయవాడకు ఉదయం బయలుదేరారు. ఉదయం 7గంటల ప్రాంతంలో కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ గ్రామానికి చేరుకునే సమయానికి కారు ఏసీలో నుంచి పొగ వచ్చింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలు కారును రోడ్డు పక్కకు నిలిపి కిందకు దిగి కారును పరిశీలించారు. అప్పటికే పొగ దట్టంగా కమ్ముకుని మంటలు ఎగిశాయి. కారు అద్దాలు మూసి ఉండటం, మంటలు పెరగడంతో కారు లోపల పీడనం అధికమై భారీ శబ్ధంతో కారు అద్దాలు పగిలాయి. దీంతో వెంకట్రావు దంపతులు భయాందోళనతో దూరంగా పరుగెత్తారు. భారీ శబ్దానికి పరిసరాల్లోని వారంతా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న నకిరేకల్ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కేతేపల్లి ఎస్ఐ ఏ.శివతేజగౌడ్ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సోమవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి.

10 నిమిషాల్లో ఇంటికి చేరుకుంటామనగా...


రాంబాబు (ఫైల్ ఫొటో)

మునగాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విధులు ముగించుకొని 10 నిమిషాల్లో ఇంటికి చేరుకుంటామనగా ఆగిన కారు మృత్యు రూపంలో కబళించింది. సూర్యాపేట జిల్లా మునగాల మండలం ముకుందాపురం శివారులో సోమవారం రాత్రి 65వ నెంబర్ జాతీయరహదారిపై ఆగిన ఓ కారును వెనుక నుంచి ఢీకొట్టడంతో ఓ కానిస్టేబుల్ అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల గ్రామానికి చెందిన నారగాని రాంబాబు(40) కోదాడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం విధు లు ముగించుకొని ఇంటికి బైక్‌పై బయలుదేరాడు. ముకుందాపురం సమీపంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే కారు పంక్చర్ కావటంతో రోడ్డు మీద ఆపారు. కోదాడ నుంచి మునగాలకు వెళ్తున్న రాంబాబు ఆగిన కారును వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాంబాబు తల, ముఖానికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాంబాబుకు భార్య, బాబు, పాప ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భోజనం చేసేందుకు రోడ్డు దాటుతుండగా...

చిట్యాలరూరల్: భోజనం కోసం రోడ్డు దాటుతుండగా కంటెయినర్ డ్రైవర్ కారు ఢీకొని మృతిచెందాడు. ఈ ప్రమాదం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో ఆదివారం అర్ధరాత్రి దాటాక జరిగింది. ఎస్ఐ ధర్మ తెలిపిన వివరాల ప్రకారం... కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా హోమ్నాబాద్‌లోని తోఫ్ గల్లీ ప్రాంతానికి చెందిన మహ్మద్ జహీర్‌పటేల్(47) కంటైనర్ కొనుగోలు చేసి నడుపుతున్నాడు. హోమ్నాబాద్ నుంచి ఏపీ రాష్ట్రంలోని విశాఖపట్నం జిప్సం లోడుతో వెళ్తున్నాడు. మండలంలోని పెద్దకాపర్తి శివారులోకి వచ్చిన తర్వాత ఆకలి వేయడంతో కంటైనర్‌ను గాంధీ గుడి ఎదురుగా వాహనాన్ని ఆపాడు. గాంధీ గుడి పక్కనున్న హోటల్‌లో భోజనం చేసేందుకు రోడ్డు దాటుతుండగా హైదరాబాద్‌కు వెళ్తున్న కారు జహీర్‌పటేల్‌ను ఢీకొట్టి మీదుగా దూసుకెళ్లాడు. దీంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదం సమాచారాన్ని తెలుసుకున్న చిట్యాల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించి శవపరీక్ష నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబసభ్యులకు మృతదేహా న్ని అప్పగించారు. మృతుడి కుమారుడు అమ్జద్ పటేల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ట్రాక్టర్ అదుపు తప్పి, మరొకరు..

మునగాల: సూర్యాపేట జిల్లా మునగాల మండలం ఆకుపాముల శివారులో జాతీయ రహదారిపై సోమవారం రాత్రి ట్రాక్టర్ అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొనటంతో డ్రైవర్ మృతి చెందారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన పాలపాటి వీరబాబు (40), ధాన్యం లోడ్‌ను బరాఖాత్‌గూడెం ఐకేపీలో దిగుమతి చేసి, తిరిగి కోదాడ వైపు వెళ్తున్నాడు. ఆ సమయంలో ఆకుపాముల సమీపంలో ట్రాక్టర్ అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వీరబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపాడు.

బస్సులు ఢీకొని ముగ్గురు ప్రయాణికులకు గాయాలు

చౌటుప్పల్‌రూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లక్కారం జాతీయరహదారిపై సోమవారం తెల్లవారు జామున ఆగి ఉన్న బస్సును వెనుక వైపు నుంచి మరో బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురి ప్రయాణికులకు గాయాలయ్యాయి. సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా సత్తుపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి ఖమ్మం బయలుదేరింది. లక్కారం వద్ద జాతీయ రహదారిపై విజయవాడ డిపోకు చెందిన బస్సు సడన్ బ్రేక్ వేశాడు. రోడ్డుపై నిలపడంతో వెనుక వైపు నుంచి వస్తున్న సత్తుపల్లి డిపో బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మేఘన, సాయి ప్రియాంక, మోహన్‌రావు ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సత్తుపల్లి బస్సు డ్రైవర్ నారేళ్ల నరేందర్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పెండింగ్ బిల్లుల కోసం ఎదురుచూపు

(5వ పేజీ తరువాయి)

సూర్యాపేట జిల్లాలో రూ.50కోట్లు, యాదాద్రి జిల్లాలో సుమారు రూ.40కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఈ బిల్లులు రావాల్సి ఉంది. ప్రతీ మండలం నుంచి బకాయిలున్నాయని పేర్కొంటున్న సర్పంచ్‌లు దశలవారీగా ఆందోళనలు చేస్తున్నా ఫలితం కన్పించడం లేదు. ఈ పనులు చేపట్టేందుకు డబ్బు అప్పుగా తెచ్చామని, ఏడాదిన్నర కాలంగా వడ్డీ చెల్లిస్తుండడంతో భారం పెరిగి ఇబ్బంది కలుగుతోందని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్చి నెలాఖరుకు బిల్లులన్నీ క్లియర్ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా, పూర్తిస్థాయి చెల్లింపులు చేయలేదు. ఇంకా బిల్లు బకాయిలున్నాయని, తక్షణం వాటిని చెల్లించాలని వారు కోరుతున్నారు.

బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నాం

మా పంచాయతీలో మేం చేసిన 'మన ఊరు-మనబడి' పనులు, ఇంకుడు గుంతల పనులు, తాగునీటి పైపులైన్ల మరమ్మతులు, క్రీడాప్రాంగణం ఏర్పాటుకు సంబంధించి సుమారు రూ.30లక్షల వరకు బిల్లులు పెండింగ్ ఉన్నాయి. బిల్లులు రాకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం మా ఇబ్బందులు గుర్తించి పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి.

● దండ రేణుక, భైరవునిబండ మాజీ సర్పంచ్, శాలిగౌరారం మండలం

ఏడాదైనా రూ.6లక్షలు రాలేదు

నేను సర్పంచ్‌గా ఉన్న కాలంలో చేసిన పారిశుధ్యపనులు, పల్లె ప్రకృతివనం ఏర్పాటు, విద్యుత్ మోటార్లు, పైప్‌లైన్ల మరమ్మతులతో పాటు ఇతర బిల్లులు సుమారు రూ.6లక్షల వరకు పెండింగ్ ఉన్నాయి. సర్పంచ్ బాధ్యతల్లో ఉన్నప్పటి నుంచే రాజకీయవైరంతో మాకు బిల్లులు రాకుండా అడ్డుకున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చాకయినా బిల్లులు వస్తాయని ఆశించినా చెల్లించడం లేదు. వడ్డీలకు తెచ్చి పనులు చేయించాం. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి.

● దేశబోయిన మల్లమ్మ, వెలిమినేడు మాజీ సర్పంచ్, చిట్యాల మండలం

చౌటుప్పల్‌లో వ్యక్తి అదృశ్యం

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం గుంట్లగూడెం గ్రామానికి చెందిన కానుగు శ్రీకాంత్ (27) అదృశ్యమైనట్లు సీఐ మన్మధకుమార్ తెలిపారు. ఫొటో గ్రాఫర్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్ చౌటుప్పల్‌కు వెళ్తున్నానని ఇంట్లో తిరిగి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ అని వస్తుంది. శ్రీకాంత్ సోదరుడు సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇసుక డంప్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని తంగెడపల్లి రోడ్డులో అక్రమంగా ఇసుక డంప్ చేసిన ఎర్ర లిం గస్వామిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. లింగస్వామి ప్రభుత్వం అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తీసుకువచ్చి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. 50 టన్నుల ఇసుకను సీజ్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

పకడ్బందీగా 'భూభారతి' అమలుచేస్తాం

(5వ పేజీ తరువాయి)

తీసుకురాగా, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ధరణితో మోసం చేసిందన్నారు. 'భూభారతి'తో సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని మంత్రి హామీ ఇచ్చిరు. గతంలో పట్టాలు ఇచ్చిన డీలిమిటేషన్ ఫారెస్ట్ భూములను పరిశీలించి సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇస్తామన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి అవగాహన పెంచుకొని రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ సదస్సులో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఎస్పీ శరత్‌చంద్రపవార్, ఏఎస్పీ మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ మండలానికి సర్వేయర్‌ను నియమించాలి : ఎమ్మెల్సీ సత్యం



ప్రతీ మండలానికి ఒక సర్వేయర్‌ను నియమించాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణిని ప్రారంభించడంతో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. కొన్ని గ్రామాలు ధరణిలో బ్లాక్ చేశారన్నారు. క్షేత్రస్థాయిలో భూములు ఉన్నవారికి పట్టాలు ఇవ్వడం, ఆన్‌లైన్‌లో నమోదు వంటివి పూర్తిచేసి సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు.

డీఫారెస్ట్ భూములు ఇచ్చారు, పాస్‌పుస్తకాలు ఇవ్వలేదు

శేఖర్‌రెడ్డి, రైతు కంభాలపల్లి



నాగార్జునసాగర్‌లో ముంపునకు గురికాగా, చందంపేట మండలంలోని కంభాలపల్లిలో అప్పటి ప్రభుత్వం ఐదు ఎకరాల భూమిని ఇచ్చింది. అప్పటి నుంచి భూమిని సాగు చేసుకుంటున్నాం. కానీ అటవీశాఖ అధికారులు భూమిని సాగు చేసుకోనివ్వడంలేదు. భూమిపై హక్కులు, పత్రాలు, పాస్‌పుస్తకాలు అందజేయాలి.

పత్తి లోడు లారీపై పిడుగు : వాహనం దగ్ధం

● సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలో ఘటన


దగ్ధమైన లారీ నుంచి పత్తిని ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగిస్తున్న సిబ్బంది

నేరేడుచర్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో పిడుగుపాటుకు పత్తి లోడు లారీ దగ్ధమైంది. ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసి పలు చోట్ల పిడుగులు పడ్డాయి. అదే సమయంలో నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి వద్దకు రాగానే పిడుగు పడడంతో లారీ పూర్తిగా కాలిపోయింది. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం చింతపల్లిలోని కవిత కాటన్ ఇండస్ట్రీస్ నుంచి రూ. 40లక్షల విలువైన 24 టన్నుల పత్తిని లారీలో లోడు చేసుకుని తమిళనాడు రాష్ట్రంలోని కోనైపట్టిలోని మహావిష్ణు స్పిన్నింగ్ మిల్లుకు తరలిస్తుండగా మార్గమధ్యలో చిల్లేపల్లి వద్ద పిడుగుపాటుకు దగ్ధమైంది. ఈ లారీ విలువ రూ. 40లక్షలు ఉంటుందని తెలిసింది. రాత్రి 11.30 గంటల సమయంలో లారీ నుంచి వెనుక వస్తున్న వాహనదారులు డ్రైవర్‌కు విషయం చెప్పడంతో పక్కకు ఆపి చూడగా మంటలు అప్పటికే పూర్తిస్థాయిలో అలుముకున్నాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. మిర్యాలగూడ నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పే యత్నం చేశారు. వర్షం కురుస్తున్నా, అగ్నిమాపక సిబ్బంది నీటిని చల్లినా మంటలు ఆరలేదు. ఆదివారం సాయంత్రం వరకు అగ్నిమాపక సిబ్బంది శ్రమించి మంటలను ఆర్పేందుకు యత్నించారు. ఎక్స్‌కవేటర్ సాయంతో పత్తిని తిరగేస్తూ మంటలను పూర్తిస్థాయిలో అదుపులోకి తెచ్చి చల్లారుస్తున్నారు. రహదారిపైనే పత్తి ఉండడంతో పొగలు వస్తూనే ఉన్నాయి. సోమవారం రాత్రి వరకు అగ్నిమాపక సిబ్బందితో పాటు చిల్లేపల్లి గ్రామ పంచాయతీ సిబ్బంది కూడా నిరంతరాయంగా వాటర్ ట్యాంకర్ సాయంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. లారీ డ్రైవర్ రాజురమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేపీఎం కళాశాల ప్రిన్సిపాల్‌గా మేదరి షీబా



నల్లగొండ టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కోమటిరెడ్డి ప్రతీక్ మెమోరి యల్ ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ మేదరి షీబా నియమితులయ్యారు. సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన తాడిశెట్టి నరసింహ ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో అదే కళాశాలలో ఇంగ్లీష్ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న డాక్టర్ మేదరి షీబా నియమితులయ్యారు.

నేడు మీట్‌ద హెచ్‌ఎం.. అండ్ టీచర్స్ కార్యక్రమం

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం బడిబాట పేరిట ఉపాధ్యాయులను గ్రామంలోని విద్యార్థుల ఇళ్లకు పంపిస్తున్నారు. నార్కట్‌పల్లి జడ్పీహెచ్ఎస్ స్పాన్ (స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ నార్కట్‌పల్లి) ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులే ఉపాధ్యాయులను కలిసేలా 'మీట్ ద హెచ్‌ఎం... అండ్ టీచర్స్' పేరిట ఈ నెల 22న పాఠశాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



రైతులతో మాట్లాడుతున్న సింగిల్ విండో చైర్మన్ నర్సిరెడ్డి, తహసీల్దార్ దేవాసింగ్

నాంపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని సింగిల్‌విండో చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని మార్కెట్ యార్డులో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం నిర్వహించే ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దనే రైతులకు మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చేటప్పుడు కల్లాల వద్దనే ఆరబెట్టుకుని తాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేవాసింగ్, ఏఈవో అనూష, అన్నెపాక హరీష్, బిరుదోజు యాదమ్మ, నరసింహ, రాములు, నరేష్, యాదగిరి, శివ పాల్గొన్నారు.

మేడేను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

కేతేపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ కోరారు. మండలకేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కార్మిక దినోత్సవంలో ప్రతి కార్మికుడూ పాల్గొనాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై మే 20వ తేదీన దేశ వ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చాక 44కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను అమలులోకి తేవడం ద్వారా కార్మికుల హక్కులను కాలరాసిందని విమర్శించారు. సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ ఆదిమళ్ల సుధీర్, నాయకులు ఏడాకుల కోటయ్య, తాళ్ల సైదులు, ఎడ్ల తానుష్క, కె. ముత్తమ్మ, ఎం. సునీత, వి. పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ముందడుగు వేయాలి



మాట్లాడుతున్న లయన్స్‌క్లబ్ ఆఫ్ నల్లగొండ స్నేహ అధ్యక్షురాలు సరళ

చిట్యాలరూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి పొంది జీవితంలో ముందడుగు వేయాలని లయన్స్‌క్లబ్ జిల్లా ప్రతినిధి రేపాల మదన్‌మోహన్, లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ స్నేహ అధ్యక్షురాలు యాస సరళ అన్నారు. మండలంలోని నేరడ ప్రాథమిక పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల తల్లులకు సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ స్నేహ ఆధ్వర్యంలో ఉచితంగా 15మందికి కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. మహిళలు ఇంటి వద్ద ఉంటూ ఇంటి పనితో పాటుగా స్వయం ఉపాధిని పొందవచ్చన్నారు. స్వయం ఉపాధితో స్వశక్తితో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కుటుంబ పోషణ సులువవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కోడె సతీష్‌కుమార్, చిలుకూరి రామకృష్ణ, అశోక్‌రెడ్డి, పద్మ, శారద, చంద్రావతి, విజయలక్ష్మి, ఇందిర, హెచ్‌ఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారం అందజేస్తున్న సీడీపీవో లావణ్యకుమారి

చిట్యాలరూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని మునుగోడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో లావణ్యకుమారి అన్నారు. మండలంలోని ఏపూర్ గ్రామంలో అంగన్‌వాడీకేంద్రం ఆధ్వర్యంలో సోమవారం పోషణ్‌అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే అంగన్‌వాడీ కేంద్రాల లక్ష్యమన్నారు. గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసీడీపీవోవెంకటమ్మ, సునీత, అంజయ్య, హంసమ్మ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకు గురవుతున్న ఈత వనాన్ని రక్షించాలి

చండూరు రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కబ్జాకు గురవుతున్న ఈత వనాన్ని పరిరక్షించాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనుంజయ అన్నారు. ఈత వనాన్ని పరిరక్షించాలని కోరుతూ కల్లుగీత కార్మికులు మండలంలోని నెర్మట గ్రామంలో సోమవారం ఈత వనం వద్ద నిరసన తెలిపారు. ఈత వనం ఉన్న ప్రభుత్వ బంజరాయి భూమిలో ప్రభుత్వం గీత కార్మికుల కోసం ఈత, ఖర్జూర వనాన్ని పెంచారని, ఆ భూమిని కొందరు తమ భూమి అని దౌర్జన్యంగా గ్రామపంచాయతీ అనుమతి లేకుండా కంపచెట్లు తొలగించి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై గతంలో ఎక్సైజ్ అధికారులకు, రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బురుకల అంజయ్య, బండమీది వెంకటయ్య, బొడిగె నగేష్, యాదయ్య, శంకర్, శేఖర్, రాజ్‌కుమార్, సైదులు, స్వామి పాల్గొన్నారు.



తాటి వనం వద్ద నిరసన తెలుపుతున్న గీత కార్మికులు

ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి

- వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాలువ సుజాత



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాలువ సుజాత

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత పిలుపునిచ్చారు. చట్టసభల్లో ఆర్యవైశ్యుల ప్రాతినిధ్యం పెరగాలని ఆమె ఆకాంక్షించారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని వాసవీ భవన్‌లో ఆదివారం రాత్రి జరిగిన నార్కట్‌పల్లి మండల ఆర్యవైశ్య మహాసభ నూతన మండల, పట్టణ, యువత, మహిళా కమిటీల ప్రమాణ స్వీకారోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. నూతనంగా పదవీ ప్రమాణం చేసిన వారంతా మీకంటే ముందు పనిచేసిన సంఘ నాయకుల సలహాలు సూచనలు తీసుకుని వాసవీభవన్ అభివృద్ధితో పాటు వైశ్యుల సంక్షేమానికి పాటుపడాలన్నారు. వ్యాపార క్షేత్రంతో పాటు ప్రజాక్షేత్రంలో కూడా ఆర్యవైశ్యులు తమ ప్రభావాన్ని చూపించాలని పిలుపునిచ్చారు. పోటీతత్వం సరైందే కానీ అది వైశ్య సమాజ అభివృద్ధికి దోహదపడేలా ఉండాలని కాలువ సుజాత సూచించారు. సమాజంలో అన్ని కులాలు సామాజిక న్యాయం కోసం పోరాటాలు చేస్తుంటే ఆర్యవైశ్యులు మాత్రం అడగరన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కులగణన చేసిందని అందులో వైశ్య జనాభా గణన కూడా ఉన్నందున రాబోయే రోజుల్లో జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో ఆర్యవైశ్యుల ప్రాతినిధ్యం పెరగవచ్చని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్యుల కులదేవత వాసవీ మాత ఆలయ నిర్మాణానికి కావల్సిన స్థలం కోసం స్థానిక ఎమ్మెల్యే సహకారంతో జిల్లా మంత్రి, దేవదాయ శాఖ మంత్రిని కలిసి మంజూరు చేయిస్తానని కాలువ సుజాత హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు తేరటుపల్లి చంద్రశేఖర్, కాచం సుష్మ, నాంపల్లి భాగ్య, లక్ష్మిశెట్టి శ్రీనివాస్, ఎల్‌వీ కుమార్, కోటగిరి దైవాదీనం, గుండా నాగరాజు, వనమా మనోహర్, స్థానిక సంఘ నాయకులు పాల్వాయి భాస్కర్‌రావు, సల్లా వాసుదేవ్, రంగా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పదవిపై ఉన్న ధ్యాస అభివృద్ధిపై లేదు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

గట్టుప్పల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రిపై ధ్యాస ఈ ప్రాంత అభివృద్ధిపై లేదని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. మండలకేంద్రంలో సోమవారం జరిగిన బీఆర్ఎస్ మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అభివృద్ధికి పనులకు మంజూరైన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసినా స్థానిక ఎమ్మెల్యేకు సోయి లేదని ఎద్దేవా చేశారు. కోమటిరెడ్డి బ్రదర్స్ ఈ ప్రాంతాన్ని వెనుకబాటులో ఉంచేందుకు కుట్రపన్నుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తాము గ్రామస్థాయి నుంచి పనిచేశామన్నారు. ఎన్నికల సమయంలో రాజగోపాల్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చలేకపోతే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, మద్ది ప్రవీణ్‌రెడ్డి, రావుల ఐలయ్య, అవ్వారి శ్రీనివాస్, కుండే వెంకటేశం, గొరిగే సత్తయ్య, చెరుపల్లి భాస్కర్, భీమనపల్లి సత్తయ్య, హనుమంతు, లింగయ్య, చంద్రయ్య, లక్ష్మయ్య ఉన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్

నకిరేకల్, ఏప్రిల్ 21, (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, నార్కట్‌పల్లి మాజీ ఎంపీపీ నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నకిరేకల్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపర్చిన ఆర్టికల్-3 ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని అన్నారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. మాజీమంత్రి జగదీ‌ష్‌రెడ్డి నాయకత్వంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి కార్యకర్తలు, ప్రజలు రజతోత్సవ సభకు అధికంగా తరలిరావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను నిండా ముంచిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. రేవంత్‌రెడ్డి పాలన దోపిడీ, అరాచకాలతో కొనసాగుతోందన్నారు. ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి నిర్బంధాలతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు. అనంతరం రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చల్లా కృష్ణారెడ్డి, ఊట్కూరి ఏడుకొండలు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నూక సైదులు, యల్లపురెడ్డి సైదిరెడ్డి, పొల్లెంల ముత్తయ్య, చెరుకు వెంకటాద్రి, యాతాకుల సోమయ్య, గుండాల మల్లేష్, మేకల రమేష్, ముప్పిడి యాదయ్య, చిట్యాల రాజిరెడ్డి, శ్రీకాకోల మిధున్, కొత్త నర్సింహ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



చండూరు: ఉడతలపల్లి గ్రామంలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

చండూరు రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలకు నాణ్యమైన, గుణాత్మకమైన విద్య లభిస్తుందని మండల విద్యాధికారి ఊటుకూరు సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఉడుతపల్లి గ్రామంలో ముందస్తు బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న వివిధ వసతులను తల్లిదండ్రులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సంగీత, ఉపాధ్యాయులు రాజేష్, పద్మ, పంచాయతీ కార్యదర్శి శంకర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

శాలిగౌరారం: బడికి వెళ్లకుండా ఇంటి వద్ద ఉండే పిల్లలంతా బడిలో చేరాలని ఉపాధ్యాయులు కోరారు. మండలం మనిమద్దె గ్రామంలో ముందస్తు బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎం విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య, ఉచిత పుస్తకాలు, మధ్యాహ్నం భోజనం, రెండు జతల ఏకరూప దుస్తులు, వారానికి మూడు రోజులు రాగి జావ, మూడు రోజులు కోడిగుడ్డు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, మల్లేష్, మారోజు వెంకటాచారి, అంగన్వాడీ టీచర్ శంకరమ్మ, ఏఎన్ఎం సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు షేక్ ఇంతియాజ్ అహ్మద్

శాలిగౌరారం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్ ఇంతియాజ్ అహ్మద్ అన్నారు. శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలో పలువురికి సీఎంఆర్ చెక్కులను పంపిణీ చేశారు. కట్టగూరి పార్వతమ్మకు మంజూరైన రూ.35వేలు, భూపతి సత్యనారాయణకు రూ.45వేలు, బెల్లి సరస్వతి భర్త సైదులుకు రూ.60వేల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మాదగోని కవిత రామలింగయ్య, మాజీ ఉపసర్పంచ్ సైదులు, మాజీ వార్డు సభ్యులు పద్మ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచాలి



వినతిపత్రాలు తీసుకుంటున్న గోలి ప్రభాకర్

నకిరేకల్, ఏప్రిల్ 21, (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్‌ను రూ.6వేలకు పెంచి, పెంచి ఉచితంగా బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని తెలంగాణ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోలి ప్రభాకర్ డిమాండ్ చేశారు. మండలంలోని తాటికల్, మంగళపల్లి, నర్సింహ్మాపురం గ్రామాల్లో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ పథకంలో దివ్యాంగులకు ప్రత్యేక పనులు చూపించాలని 55శాతం ఎక్కువ కూలీ అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో కారింగ్ శ్రీనివాస్, మేడ యాదగిరి, బొమ్మకంటి కొమురయ్య, తండు సైదులు తదితరులు పాల్గొన్నారు.

చెరుకు సుధాకర్‌కు చిరుమర్తి పరామర్శ



చెరుకు సుధాకర్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, ఏప్రిల్ 21, (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ చెరుకు సుధాకర్‌ను నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సోమవారం పరామర్శించారు. ఇటీవల ప్రమాదవశాత్తు ఇంట్లో కాలు జారిపడి ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న సుధాకర్‌ను ఆయన పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో మునిసిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనువాస్‌గౌడ్, నకిరేకల్, కేతేపల్లి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, మారం వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ పల్లె విజయ్, నాయకులు రాచకొండ శ్రవణ్, రాచకొండ వెంకన్న, గుర్రం గణేష్ ఉన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి



ఇస్మాయిల్‌పల్లిలో కూలీలతో మాట్లాడుతున్న నారి ఐలయ్య

కట్టంగూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎనిమిది వారాల నుంచి పెండింగ్‌లో ఉన్న కూలీల బకాయిలను వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య డిమాండ్ చేశారు. మండలంలోని ఇస్మాయిల్‌పల్లి, పామనగుండ్ల గ్రామాల్లో ఉపాధి పనులను సోమవారం పరిశీలించారు. ఎనిమిది వారాల నుంచి పనిచేస్తున్న ఉపాధి కూలీలకు వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పనిచేసిన కూలీలకు రోజుకు రూ.307 రావాల్సి ఉండగా రోజుకు రూ.100లు మించి రావడం లేదన్నారు. ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో మంచినీరు, నీడ, మెడికల్ కిట్‌లు ఎక్కడ ఏర్పాటు చేయలేదన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ కొరవడిందన్నారు. ప్రతి కూలీకి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బొజ్జ చిన్నవెంకులు, నాయకులు మాద సైదులు, మాద ఉమ, భాస్కర్ రెడ్డి, బండారు నాగమణి, మేడబోయిన యాదయ్య, అండాలు, మంగమ్మ, లక్ష్మమ్మ, కృష్ణవేణి ఉన్నారు.

27న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

కేతేపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్‌లో 6-10వ తరగతి వరకు చేరే విద్యార్థులకు ఈ నెల 27న ప్రభుత్వం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు కొర్లపహాడ్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మమత తెలిపారు. 6వ తరగతిలో చేరేందుకు దరఖాస్తు చేసిన వారికి 27న ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు 7-10వ తరగతి వరకు చేరేందుకు దరఖాస్తు చేసిన వారికి మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. 45నిమిషాల ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, హాల్ టికెట్‌తో పాటు పరీక్ష ప్యాడ్, బాల్ పెన్నులు, వాటర్ బాటిల్ తెచ్చుకోవాలని సూచించారు.

భూ భారతిపై నేడు అవగాహన సదస్సు

కేతేపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టం అమలుపై కేతేపల్లి మండలకేంద్రంలో మంగళవారం మండల స్థాయి అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎన్. మధుసూదన్‌రెడ్డి తెలిపారు. స్థానిక జ్యోతి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే ఈ అవగాహన సదస్సుకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, కలెక్టర్ ఇలాత్రిపాఠి హాజరవుతారని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, ప్రస్తుత, మాజీ మండల ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు హాజరై భూ భారతి చట్టంపై అవగాహన కల్పించుకోవాలని ఆయన కోరారు.

బీఆర్ఎస్‌లో చేరిక

కనగల్, ఏప్రిల్ 21:(ఆంధ్రజ్యోతి) మండలంలోని దోరెపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చినపాక వినోద్ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐతగోని యాదయ్యగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. భూపాల్‌రెడ్డి వీరికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజల్లో కాంగ్రెస్ పాలన పట్ల వ్యతిరేకత వ్యక్తం అవుతోందన్నారు. గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐతగోని శ్రీను, చినపాక మహేష్, అశోక్, చెనగోని నాగరాజు ఉన్నారు.

గీత సహకార సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల



నకిరేకల్, ఏప్రిల్ 21, (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ కల్లుగీత పారిశ్రామిక సహ కార సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను సోమవారం సంఘం కార్యాలయంలో ఎన్నికల అధికారి డి. నాగేశ్వర్‌రావు విడుదల చేశారు. మే నెల 5వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సహకార సంఘానికి చెందిన 9 డైరెక్టర్లకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తార న్నారు. కార్యక్రమంలో కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కొండ జానయ్యగౌడ్ పాల్గొన్నారు.


మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నకిరేకల్, ఏప్రిల్ 21,(ఆంధ్రజ్యోతి): నకిరేకల్‌కు చెందిన కల్లుగీత కార్మికుడు బొడ్డు సైదులు అనారోగ్యంతో మృతి చెందడంతో కొండ జానయ్యగౌడ్ ట్రస్ట్ ద్వారా ట్రస్ట్ చైర్మన్ కొండ శ్రీనుగౌడ్ మృతుని కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. నకిరేకల్ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కొండ జానయ్యగౌడ్, సొసైటీ సభ్యులు భూపతి వెంకటనారాయణ, కొండ యాదగిరి, శ్రీను, మాదగోని వెంకన్న, తలారి వెంకటేశం తదితరులు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆంధ్రజ్యోతి

***

ANDHRAJYOTHY



నల్లగొండ

5

మంగళవారం 22 ఏప్రిల్ 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	240	270
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.5 । కనిష్ఠం 25.0

పుడమితల్లికి పుట్టెడు కష్టాలు

ఎరువులు, ప్లాస్టిక్‌తో భూసారం కలుషితం

నేడు ధరిత్రి దినోత్సవం



భూమి సకల జీవులకు ప్రాణాధారం. జీవకోటికి ఆహారాన్ని అందిస్తున్న భూమి అభివృద్ధి పేరుతో మనిషి చేసే విధ్వంసానికి బలైపోతోంది. భూ కాలుష్యం రోజురోజుకూ పెరుగుతుండగా, భూ పరిరక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోకపోగా చెట్ల నరికివేత, సహజ నిక్షేపాల వెలికితీతతో మరింత దెబ్బతీస్తున్నాయి. దీని పర్యవసానమే భూకంపాలు, సునామీలు సంభవిస్తున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. పరిశ్రమలు విడుదల చేసే వాయువుల ప్రభావంతో వాతావరణంలో సమతుల్యత దెబ్బతిని భూమి రోజురోజుకూ వేడెక్కుతోంది. సాంకేతీకరణ పెరిగి నూతన ఆవిష్కరణలు వస్తున్నా సహజవనరులను నియంత్రణ లేకుండా వినియోగిస్తుండటంతో ధరిత్రి దెబ్బతింటోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా విస్తీర్ణం 14.25 లక్షల హెక్టార్లు ఉండగా, అందులో కేవలం 6శాతం మేరకే అడవులు ఉన్నాయి. 83,859 హెక్టార్లలో మాత్రమే అటవీ విస్తీర్ణం ఉంది.

•6లో..

పెండింగ్ బిల్లుల కోసం.. ఎదురుచూపు



- మార్చిలో చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినా అందని నిధులు
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ.150కోట్ల వరకు బకాయిలు
- వడ్డీల భారంతో ఇబ్బంది పడుతున్నామంటున్న మాజీలు

పదవిలో ఉన్నప్పుడు చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతో మాజీ సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు. బిల్లులు పెండింగ్ ఉండడంతో చేసిన అప్పులకు వడ్డీ చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు.పెండింగ్ బిల్లులన్నీ మంజూరు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం పూర్తిస్థాయిలో చెల్లించకపోవడంతో అవస్థలుపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదవీకాలం ముగిసి ఏడాదిన్నరైనా పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడం దారుణమని వాపోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తం గా 1,740 గ్రామపంచాయతీలు ఉండగా, సుమా రు రూ.150కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని తక్షణమే చెల్లించి ఆదుకోవాలని మాజీ సర్పంచ్‌లు డిమాండ్ చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1,740 గ్రామపంచాయతీలు ఉండగా నల్లగొండ జిల్లాలో 844, సూర్యాపేటలో 475, యాదాద్రి జిల్లాలో 421 పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాలు నిధులిచ్చేవి. గ్రామాల్లో ఈ నిధులతోనే అభివృద్ధి పనులు నిర్వహిస్తారు. ప్రతీ మూడు నెలలకోసారి ఈ నిధులు వచ్చేవి. దీంతో పనులు చేస్తే ఢోకా ఉండదనే నమ్మకంతో సర్పంచ్‌లు సొంత పైసలతో పనులు చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడం,అదే సమయంలో పాలవకర్గాల గడువు ముగియడం, తదితర కారణాలతో చేసిన పనుల కు బిల్లులు నిలిచిపోయాయి. సీసీ రోడ్లు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణా లు, డ్రైనేజీలు, వీధిదీపాల ఏర్పాటు, శ్మశానవాటికలు, పల్లె ప్రకృతివనాలు, పైప్‌లైన్లు, డంపింగ్ యార్డుల నిర్మాణాలు, క్రీడామైదానాలు, వాటర్ మోటర్ల ఏర్పాటు వంటి పనులకు చేసిన బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సర్పంచ్‌లు వాపోతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ పనులకు సంబంధించి సుమారు రూ.150కోట్ల వరకు బకాయిలున్నాయి. నల్లగొండ జిల్లాలోరూ.60 కోట్లు

- మిగతా 7వ పేజీలో...


రూ.10లక్షల వరకు బిల్లులు పెండింగ్



మా గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలతో పాటు రైతు వేదిక, పల్లె ప్రకృతివనాలకు సంబంధించిన బిల్లులు సుమారు రూ.10లక్షల వరకు రావాల్సి ఉంది. రెండేళ్ల నుంచి బిల్లులు రాకపోవడంతో అవస్థపడుతున్నాం. ఎంబీలు సైతం చేసినా బిల్లులు మంజూరు చేయడం లేదు. ప్రభుత్వం తక్షణం స్పందించి పాత బిల్లులు వెంటనే చెల్లించాలి.

- ఈడం రోజా, గట్టుప్పల్ మాజీ సర్పంచ్

రెండేళ్ల నుంచి రూ.20లక్షలు ఆగాయి



గ్రామంలో పల్లెప్రగతి కింద చేపట్టిన డ్రైనేజీల నిర్మాణాలు, ఎస్ఎఫ్‌సీ కింద చేపట్టిన పనులు, పైప్‌లైన్ల ఏర్పాటు, నర్సరీలు, ట్రాక్టర్ల నిర్వహణలకు సంబంధించిన సుమారు రూ.20లక్షల బిల్లులు పెండింగ్ ఉన్నాయి. బిల్లులు వస్తాయనే నమ్మకంతో వడ్డీలకు తెచ్చి పనులు చేయించాం. వడ్డీలు పెరుగుతున్నాయే తప్ప బిల్లులు ఇవ్వడం లేదు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా ఇస్తామంటున్నారే తప్ప రావడం లేదు.

- రొట్టెల రమేష్, తిప్పర్తి మాజీ సర్పంచ్

సాగుకు సాంకేతిక ఊతం



వ్యవసాయరంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్నాహాలు చేస్తున్నాయి. పంటలు సాగుపై ఇప్పటికే ప్రభుత్వాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నాయి.దీనికి తోడు రైతులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సంక్షేమ పథకాలు,విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, తదితర అంశాలను సులభతరం చేసేందుకు సన్నద్ధమవుతున్నాయి. ఆధార్ కార్డు మాదిరిగా రైతుల కు భూధార్ కార్డులతో గుర్తింపు ఇవ్వనున్నారు. అన్నదాతకు సం బంధించిన భూ కమతానికి 14 అంకెలతో కూడిన విశిష్ట సంఖ్య(యూనిక్ కోడ్) కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

- ఆధార్‌కార్డు మాదిరిగానే రైతులకు భూధార్‌కార్డు
- 14 అంకెలతో యూనిక్ కోడ్

భూదార్ కార్డు జారీ కోసం కేంద్ర ప్రభుత్వ అధికారులు తాజాగా రాష్ట్ర వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి రైతులకు సంబంధించిన పూర్తి వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని, దీనికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేస్తామని పేర్కొన్నారు. వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు జిల్లా అధికారులతో సమావేశాలు నిర్వహించి, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న యూనిక్‌కోడ్‌ను ప్రతిష్ఠాత్మకంగా భావించాలని, రైతులకు సంబంధించిన సేవలను పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలని సూచించారు. ఈ మేరకు అన్ని జిల్లాల్లోనూ వ్యవసాయశాఖ పరిధిలోని డివిజన్, మండల ఏఈవోలతో సమావేశాన్ని ఏర్పాటుచేసి, వారికి యూనిక్ కార్డు నమోదుకు సంబంధించిన పూర్తి అవగాహన కల్పించనున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖ అధికారులతో యూనిక్‌కోడ్ నమోదుపై సమావేశాన్ని ఏర్పాటుచేసి వివరించారు. అన్ని డివిజన్లలో సంబంధిత అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. భూములు ఉన్న ప్రతీ రైతు వద్దకు వెళ్లి పట్టాదారు పుస్తకాల ఆధారంగా సర్వే నిర్వహించి, ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదు చేయనున్నారు.

భూముల వివరాలు ఫార్మర్ రిజిస్ట్రీలో

ప్రతీ రైతుకు సంబంధించిన భూముల వివరాలు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదవుతాయి. రైతులకు విశిష్ట సంఖ్య కేటాయించడంతో బ్యాంకింగ్, బీమా, తదితర వ్యవస్థలకు సులభంగా అనుసంధానం చేసుకునే అవకాశం ఉంటుంది. భూయాజమాన్య హక్కుల గుర్తింపు, వివాదాలను నివారించి పారదర్శకత పెంచేందుకు ఆస్కారం ఉంటుంది. రైతు విశిష్ట సంఖ్యను పొందేందుకు ఆధార్‌కార్డుతో పాటు దానికి అనుసంధానమైన మొబైల్‌నెంబరు, భూపట్టాదారు పాస్‌పుస్తకం ఏఈవోలకు అందించాలి. రైతు భరోసా, రుణమాఫీతో ఈ గుర్తింపు సంఖ్యకు ఎలాంటి సంబంధం లేదని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతానికి కేంద్ర ప్రభుత్వ పథకాలకు మాత్రమే దీన్ని ప్రామాణికంగా తీసుకోనున్నట్టు సమాచారం.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



డిండిలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

డిండి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు ఆక్రమించే ప్రయత్నం చేస్తే చట్టపర చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం డిండి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో 'భూభారతి' చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అసైన్డ్ భూమిని (ప్రభుత్వ భూమి) ఎవ్వరూ విక్రయించవద్దన్నారు. రైతులు సాగుచేస్తున్న నీటి పారుదలశాఖ భూములపై రైతులకు హక్కులు కల్పించాలని వంగాల లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ తహసీల్దార్ అంబటి ఆంజనేయులును రైతులు సాగుచేస్తున్న భూముల వివరాలు కోరగా, ఆయన సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

భూ భారతితో భూసమస్యలు 99శాతం పరిష్కారం అవుతాయని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, నయాబ్ తహసీల్దార్ రాగ్యానాయక్, ఏవో రెహనా, డాక్టర్ శాలిని, సీనియర్ అసిస్టెంట్ ముస్తఫా, ఆర్ఐ నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

ఎస్పీ శరత్‌చంద్రపవార్

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పనిచేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 30మంది నుంచి ఎస్పీ ఫిర్యాదులు తీసుకొని వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు పోలీస్‌శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. బాధితుల సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా, చట్టపరంగా న్యాయం జరిగేలా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారుడికి పోలీస్‌శాఖపై భరోసా కల్పించాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరించాలన్నారు.

పకడ్బందీగా 'భూభారతి' అమలు చేస్తాం

- 'ధరణి'తో నష్టపోయిన రైతులందరికీ న్యాయం
- చందంపేటను పైలెట్ మండలంగా ఎంపిక చేస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



చందంపేట మండలంలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

దేవరకొండ/చందంపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): 'భూభారతి' చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని, ధరణితో నష్టపోయిన రైతులందరికీ న్యాయం చేస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం చందంపేట మండల కేంద్రంలో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని నాలుగు మండలాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని జూన్ 2 నుంచి ఇక్కడి భూసమస్యలన్నీ శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. చందంపేటను పైలెట్ మండలంగా ఎంపిక చేస్తామన్నారు. సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వలేదని కంభాలపల్లి, పొగిళ్ల, తెల్‌దేవరపల్లి గ్రామాలకు చెందిన నిర్వాసితులు, రైతులు మంత్రి దృష్టికి....

- మిగతా 7వ పేజీలో...

గిరిజనుల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి



గిరిజనుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణిని ఏర్పాటు చేసి రైతులను మోసం చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చి భూసమస్యలన్నీ పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

- ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

బ్లాక్‌లో ఉన్న ఆరు గ్రామాల్లో సమస్యల పరిష్కారం



2027లో వచ్చిన ధరణిలో చందంపేట మండలంలోని ఆరు గ్రామాలు బ్లాక్‌లో ఉన్నాయని, దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, భూభారతితో ఈ సమస్యకు పరిష్కారం చూపుతున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. భూభారతి ద్వారా తహసీల్దార్ మండల కేంద్రంలోనే అన్ని సమస్యలు 70శాతం పూర్తవుతాయని అన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నీ పరిష్కరించుకోవాలని రైతులను కోరారు.

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

భూసమస్యలన్నీ పరిష్కరించాలి



చందంపేట మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికచేసి భూసమస్యలన్నీ పరిష్కరించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో రైతుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. భూభారతితో డీఫారెస్ట్, అసైన్డ్ భూముల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పూర్తయితే దేవరకొండ నియోజకవర్గంలోని 1.50లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. రూ.1,800కోట్లను డిండి ప్రాజెక్టు నిర్మాణ పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు.

- ఎమ్మెల్యే బాలునాయక్

బీఆర్ఎస్ అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

నల్లగొండ టౌన్, నల్లగొండ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఈ నెల 27న నిర్వహించే రజతోత్సవ సభలో ఆ పార్టీ అధ్యక్ష పదవిని బీసీలకు ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం బీసీ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీని అధ్యక్షుడిగా నియమిస్తేనే 2028లో ఆ పార్టీ అధికారంలోకి వస్తుందని, లేదంటే ప్రతిపక్ష హోదా కూడా దక్కదన్నారు. బీఆర్ఎస్ 11 సార్లు సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తే అన్నిసార్లు కేసీఆరే అధ్యక్షుడయ్యారన్నారు. జానాభాలో అరశాతం కూడా లేని వెలమ సామాజికవర్గానికి చెందిన కేసీఆర్ 11 సార్లు ఎలా అధ్యక్షుడు అవుతారని ప్రశ్నించారు. ఈసారైనా బీసీలకు అధ్యక్ష పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను సీఎం చేసుకోకపోవడం ప్రజల దురదృష్టమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పడం విడ్డూరంగా ఉందని, అరశాతం లేని వారిని రెండు సార్లు ముఖ్యమంత్రిని చేశామని, ఇంకా ఎన్ని సార్లు చేయాలని ప్రశ్నించారు. బీసీలపై కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ ఉద్యమంలో అమరులైన బీసీలకు చెందిన కుటుంబాలకు అధ్యక్ష పదవి కట్టబెట్టాలన్నారు. బీసీల త్యాగాలతో బీఆర్ఎస్ పుట్టిందని, కేసీఆర్ ఫాంహౌస్‌ను వీడి బీసీ ఉద్యమాన్ని చూడాలన్నారు. అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పిన బీజేపీ ఎన్నికల అనంతరం ఆ పార్టీ ఫ్లోర్‌లీడర్‌గా బీసీని ఎందుకు నియమించలేదని ప్రశ్నించారు. బీజేపీ కూడా రాష్ట్ర అధ్యక్ష పదవిని బీసీలకు కేటాయిస్తేనే రాష్ట్రంలో ఆ పార్టీకి మనుగడ ఉంటుందన్నారు. రెండు రోజుల్లో హైదరాబాద్‌లో సెమినార్ నిర్వహించి ఈ రెండు పార్టీల కులరంగును బయటపెడతామన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు నేలపట్ల సత్యనారాయణ, నల్ల సోమమల్లయ్య, నకిరేకంటి కాశయ్యగౌడ్, చిక్కుళ్ల రాములు, చొల్లేటి రమేష్, బూడిద మల్లికార్జున్, జిల్లా ఆదినారాయణ, గంజి భిక్షమయ్య, గుండా కోటప్ప, అంజయ్య, లింగస్వామి, పాల్గొన్నారు.

నేడు అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష

మిర్యాలగూడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ అధికారులతో మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. పట్టణంలోని టీఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో మిర్యాలగూడ, నకిరేకల్, దేవరకొండ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి ఈ సమావేశం నిర్వహించనున్నారు. సమావేశం మధ్యాహ్నం 2.30 నుంచి 4.30గంటల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు.

ఆరు అడుగులకు శాలిగౌరారం ప్రాజెక్టు నీటిమట్టం

శాలిగౌరారం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండు వేసవిలో శాలిగౌరారం ప్రాజెక్టులోకి వరద వచ్చి చేరుతోంది. 20 రోజుల వరకు డెడ్‌స్టోరేజీ వద్ద ఉన్న ప్రాజెక్టులోకి మూసీనది నుంచి నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం సోమవారం సాయంత్రం వరకు ఆరు అడుగులుగా నమోదైంది. ఇటీవల హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి వచ్చే వరదతో మూసీనది ప్రవహిస్తోంది. రామన్నపేట మండలం పల్లివాడ మూసీ ఆనకట్ట వద్ద ఉన్న ఫీడర్ ఛానల్ ద్వారా శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21 అడుగులకు 6అడుగుల మేర నీరుంది.



వేసవి క్రీడా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): వేసవి క్రీడా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని బ్యాడ్మింటన్ కోచ్ మారబోయిన రామకృష్ణ, బాక్సింగ్ కోచ్ రవీందర్‌గౌడ్ కోరారు. జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వేసవి సెలవులలో రెండు విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పట్టణంలోని ఎన్నెస్పీ క్రీడామైదానంలో నిర్వహించే క్యాంప్‌ను పట్టణ, పరిసర ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏకరూప దుస్తుల అందజేత

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నర్సింగ్ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని జ్యోతి నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ముడ్డ రామారావు అన్నారు. నర్సింగ్ బాలికల కళాశాల విద్యార్థులకు సోమవారం ఏకరూప దుస్తులు అందజేశారు. నర్సింగ్ కోర్సుతో ప్రభుత్వ ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. హాస్టల్ వసతితో కూడిన బోధన అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జి సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రత్యేక పంచాయితీ

గ్రామాలు, పల్లెలు, తండాల్లో పరిపాలన కొద్ది నెలలుగా అస్తవ్యస్తంగా మారింది. ప్రత్యేకాధికారుల పాలనతో గ్రామపంచాయతీల్లో సమస్యలు పేరుకు పోయాయి. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వం నిర్వహించకపోవడం, ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ప్రభుత్వాధికారులు గ్రామ పరిపాలన విషయంలో అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి.

● ఆంధ్రజ్యోతి, తిరుమలగిరి(సాగర్)



మండలకేంద్రంలో ఇళ్ల మధ్యనే చెత్తపోయడంతో డంపింగ్‌యార్డును తలపిస్తున్న పరిస్థితి

మండలంలోని 34గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శుల పాలన సక్రమంగా లేకపోవడం, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపించడంతో గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులు కొన్ని నెలలుగా అస్తవ్యస్తంగా మారాయి. చాలా గ్రామపంచాయతీల్లో డ్రైనేజీల్లో పూడికతీత ఎప్పటికప్పుడు తీయకపోవడంతో మురుగునీటితో చెత్తాచెదారం నిండిపోయి కంపు కొడుతున్నాయి. తద్వారా మురుగు కాల్వల్లో దోమల వ్యాప్తి పెరిగి పలు వ్యాధుల బారిన పడాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో పూడిక తీసినప్పటికీ వ్యర్థాలను డంపింగ్ యార్డులకు తరలించకపోవడంతో వీధుల్లో దుర్గంధం వెదజల్లుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

వీధుల్లో పేరుకుపోతున్న చెత్త కుప్పలు

మండలంలో మొత్తం 34గ్రామపంచాయతీలు ఉన్నాయి. కొన్ని గ్రామపంచాయతీలకు అనుబంధంగా ఆవాస గ్రామాలు ఉన్నాయి. గతంలో గ్రామస్థుల నుంచి తడి, పొడి చెత్త సేకరణ కోసం ప్రభుత్వ నిధులతో ఇంటింటికి చెత్త బుట్టలను ఉచితంగా పంపిణీ చేశారు. తద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్‌యార్డులకు తరలింపు, అక్కడే నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లలో తడి చెత్త ద్వారా కంపోస్ట్ ఎరువును తయారు చేసేందుకు శ్రీకారం చుట్టారు. కానీ చాలాకాలంగా సెగ్రిగేషన్ షెడ్లలో కంపోస్ట్ ఎరువుల తయారీ నిర్వహించకపోవడంతో ప్రస్తుతం ఆ షెడ్లలో పిచ్చి మొక్కలు మొలిచి నిరూపయోగంగా మారి కొన్ని చోట్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. మండలంలో చాలా గ్రామపంచాయతీల్లో ట్రాక్టర్ల ద్వారా ఇంటింటి నుంచి చెత్తను సేకరిస్తూ డంపింగ్‌యార్డులకు తరలిస్తున్న దాఖలాలు గత ఏడాది కాలంగా సక్రమంగా లేవని ప్రజలు పేర్కొంటున్నారు. కొన్ని గ్రామపంచాయతీల్లో వారానికి ఒకటి లేదా రెండు సార్లు మినహా చాలా పంచాయతీల్లో తమ వీదుల్లోకి ఎంతో కాలంగా ట్రాక్టర్లే తిరగడం లేదని వాపోతున్నారు. కృష్ణపట్టి, పలు మారుమూలతండాల్లో పంచాయతీకి సంబంధించిన ట్రాక్టర్లు తిరగడమే లేదని అక్కడి ప్రజలు ఆరోపిస్తూ పలు విమర్శలు చేస్తున్నాయి.



సపావత్‌తండాలో స్కూల్ ఆవరణలో ఉన్న గ్రామపంచాయతీ ట్రాక్టర్



ఇళ్ల మధ్యలో చెత్త కాలుస్తున్న వైనం

గ్రామాల్లో ఎక్కడికక్కడే చెత్త పేరుకు పోతోంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో చెత్త కుప్పలను పలు వీదుల్లో ఇళ్ల మధ్యనే పెద్ద ఎత్తున పోగు చేసి తగుల బెడుతున్నారని, దీంతో చెత్త కాల్చడం వల్ల వచ్చే పొగ ఘాటైన వాసన ధాటికి ఇబ్బందులు పడుతూ అనారోగ్యం బారిన పడుతున్నట్లు పలు గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది సేకరణ చేయకపోవడంతో గత్యంతరం లేక తమ ఇళ్లలో చెత్తను వీదల్లోని ఖాళీ ప్రదేశాల్లో వేయాల్సి వస్తుందని గ్రామస్థులు తెలియచే యడం పల్లెల్లో పారిశుధ్య నిర్వహణ పరిస్థితులకు అద్దం పడుతున్నాయి.

మా ఇళ్ల పక్కనే చెత్త పోస్తున్నారు



గ్రామంలో చెత్త సరిగా సేకరించకపోవడంతో చుట్టుపక్కల ఇళ్ల వారు చెత్తను తీసుకొచ్చి ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ ప్రదేశంలో వేస్తున్నారు. చెత్తను కాల్చి వేయడంతో ఘాటైన వాసనతోపాటు పెద్ద ఎత్తున పొగ వస్తుంది. పంచాయతీ అధికారులు పట్టించుకోని చెత్త వేయకుండా చూడాలి.

● చింతల శ్రీను, అల్వాల గ్రామస్థుడు.

దోమల వ్యాప్తి విపరీతంగా ఉంది



మా తండాలో డ్రైనేజీల్లో చెత్త సరిగా తీయక పోవడంతో దోమలు పెద్ద ఎత్తున వ్యాపిస్తున్నాయి. దీంతో దోమలు కుట్టడంతో వివిధ రకాల జ్వరాలతో పాటు వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ఇంట్లో నిద్రించే పరిస్థితి లేదు. మండల అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి.

● కుర్ర విచ్చానాయక్, ఎల్లాపురంతండా వాసి.

మండలంలో సమస్యలపై త్వరలో పరిశీలిస్తాం

మండలంలో పారిశుధ్యంతోపాటు ఇతర సమస్యల పరిష్కారానికి త్వరలోనే మండలంలో పర్యటించి పరిశీలిస్తాం. సెగ్రిగేషన్ షెడ్ల సమస్యపై సంబంధిత అధికారులకు తెలిపాం.

● రాఘవ, డీఎల్‌పీవో.





రంగుసుండ్లతండాలో కాల్వ పక్కనే పేరుకుపోయిన చెత్త

పారదర్శకంగా విధులు నిర్వహించాలి



వార్డు ఆఫీసర్లకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ యూసుఫ్

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పారదర్శకంగా విధులు నిర్వహించి పట్టణానికి గుర్తింపు తేవాలని మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. కార్యాలయంలో పలు అంశాలపై వార్డు ఆఫీసర్లకు దిశానిర్దేశం చేశారు. అన్ని ఉద్యోగాలలో కెల్లా మునిసిపల్ ఉద్యోగ బాధ్యత గొప్పదని, ప్రజలతో మమేకమయ్యే ఉద్యోగంలో నిర్లక్ష్యంగా ఉండకూడదన్నారు. రేషన్ కార్డు లబ్ధిదారుల ఎంపిక బాధ్యతలను వార్డుల వారీగా వారికి అప్పగించారు. పట్టణ పరిశుభ్రత, పచ్చదనం, ఆదాయ మార్గాలపై పలు అంశాలపై ఉద్యోగులకు శిక్షణనిచ్చారు.

● ఎల్ఆర్ఎస్ దారఖాస్తుదారులు కార్యాలయంలో సంప్రదించి ఫీజులో 25 శాతం రాయితీని పొందాలన్నారు. ఫీజు రాయితీ ఈ నెల 25వ తేదీవరకే వర్తిస్తున్నందున దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓపెన్ ప్లాట్లలో వ్యర్థాలు వేయరాదని, యజమానులు అందుకవరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో టీపీఎస్ అంజయ్య, ఆర్వో జ్ఞానేశ్వరి, శానిటరీ ఎస్ఐ వెంకటరమణ, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

పూలే సినిమాను విడుదల చేయాలి

మాడ్గులపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): వాస్తవ చరిత్ర ఆధారంగా తీసిన పూలే సినిమాను కొన్ని కులాల వారు వ్యతిరేకించినంత మాత్రానా విడుదల చేయకుండా ఆపడం మూర్ఖత్వమని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ కాలం మారింది కాని మనువాద బ్రాహ్మణ భావజాలం ఇంకా ఏ మాత్రం మారలేదన్నారు. జరిగిన చరిత్రను సినిమాగా చూపిస్తే తప్పు పడుతున్నారని అన్నారు. సినిమా డైరెక్టర్, అతని కుటుంబ సభ్యులపై వ్యక్తిగతంగా అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. ఈ సినిమా ద్వారా బహుజన సమాజానికి చైతన్యం వస్తుందన్నారు.

మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి ఎమ్మెల్యే స్వాగతం



మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): చందంపేట మండల కేంద్రంలో జరిగే భూభారతి అవగాహన సదస్సుకు హాజరయ్యేందుకు వెళుతున్న తెలంగాణ రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కొద్దిసేపు దేవరకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆగారు. ఎమ్మెల్యే కార్యాలయానికి మొదటిసారిగా వచ్చిన రెవెన్యూశాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి ఎమ్మెల్యే బాలునాయక్ శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. మంత్రిని కలిసి సన్మానించినవారిలో దేవరకొండ మార్కెట్ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, కాంగ్రెస్ నల్లగొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ ఎం.ఎ.సిరాజ్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వంగాల ప్రతాప్‌రెడ్డి, నెర్మటి సతీష్‌రెడ్డి, మారేపాకల అరుణ సురేష్‌గౌడ్, జూలూరి ధనలక్ష్మీ బాలనారాయణగౌడ్, ముత్యాల సర్వయ్య, పున్న వెంకటేష్, దేవరకొండ, చందంపేట, డిండి, చింతపల్లి మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, అధికారులు ఉన్నారు.

ధాన్యం దళారులకు విక్రయించొద్దు

పెద్దవూర, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని పులిచర్ల, చలకుర్తి, చింతపల్లి గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. నేరుగా రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలన్నారు. క్వింటాకు ఏగ్రేడ్ ధాన్యానికి రూ.2320, బి గ్రేడ్ ధాన్యానికి రూ.2300 అందిస్తున్నందున రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకోని నాణ్యత ప్రమాణాలతో తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం లలిత, వీవోఏలు వీరబోయిన పద్మ, సురేందర్, కలమ్మ, ఎస్ఆర్పీలు మరియమ్మ, నాయకులు వీరబోయిన వెంకటయ్య, లక్ష్మణ్, చాపల వెంకటేశ్వర్లు, ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

మేడేను విజయవంతం చేయాలి

మిర్యాలగూడ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో జరిగిన పార్టీ నియోజకవర్గ స్థాయి జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెట్టుబడిదారీ దేశాలు విదేశీ మార్కెట్ల కోసం తమలో తామే కలహించుకుంటూ తీవ్రమైన సంక్షోభంలో కూరుకపోతున్నాయన్నారు. ప్రపంచ జనాభాలో 25 శాతం మంది ప్రజలు ఎరజెండా నీడన సంఘటితమౌతున్నారని అన్నారు. నరేంద్రమోదీ మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను పరిష్కరించాల్సింది మరిచి కొత్త సమస్యలను ప్రజలపై రుద్దుతున్నారన్నారు. వక్ఫ్ చట్టం, డీలిమిటేషన్, జమిలి ఎన్నికల లాంటివి తెరపైకి తెచ్చి ప్రజల్లో ఐక్యతను దెబ్బతీసేవిధంగా ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నారని అన్నారు. రాజ్యాంగం భారత ప్రజలకు ప్రసాదించిన ప్రాథమిక హక్కులకు సైతం విఘాతం కలిగిస్తున్నారని అన్నారు. 500 రోజులు పాలన పూర్తిచేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో 6 సంక్షేమ పథకాలను అమలు చేస్తామని నేటి వరకు అందులో సగం కూడా అమలు అమలు చేయలేదన్నారు.. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నూకల జగదీశ్‌చంద్ర, గాదె పద్మ, మూడావత్ రవినాయక్, మల్లుగౌతంరెడ్డి, భవాండ్ల పాండు, శశిదర్‌రెడ్డి, వినోద్‌నాయక్, రొండి శ్రీనివాస్, రెమిడాల పరుశరాములు, రాగిరెడ్డి మంగారెడ్డి, చౌగాని సీతారాములు, ఆయూబ్ తదితరులు పాల్గొన్నారు.



సమవేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి

నేలకూల్చారు

మొక్కలు పెంచాలి, అడవులను పెంచాలని పర్యావరణ ప్రేమికులు కోరుతుంటే అవసరాల కోసం చెట్లను నరికేస్తున్నారు. మిర్యాలగూడ పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో విద్యుత్‌లైన్ల కోసం సోమవారం ఐదు కిలోమీటర్ల మేర చెట్లను తొలగించారు. పచ్చనిచెట్లు నేలరాలడం చూసి స్థానికులు ఆవేదన చెందారు. (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ రూరల్)



కూకటి వేళ్లతో పెకిలించిన వృక్షాలు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

పెద్దవూర, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతునూరు గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని సోమవారం ప్రాథమికొన్నత పాఠశాల ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వెంకట్రామ్‌నాయక్ మాట్లాడుతూత ప్రభుత్వ పాఠశాలల్లోనే డిజిటల్ ఎడ్యుకేషన్, క్రీడలు, గురుకుల, మోడల్ ప్రవేశాలు, 5,6,7,8 తరగతుల విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఉచితంగా రెండు జతల ఏకరూప దుస్తులు, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, దాతల సహకారంతో టై, బెల్ట్, ఐడీకార్డు, ఉచిత నాణ్యమైన రుచికరమైన మధ్యాహ్న భోజనం, వెనుకబడిన పిల్లలకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్మూర్తి, మెహజాబి, గులాం అంజాద్, అంజూమ్, ధర్మారెడ్డి, అనిత పాల్గొన్నారు.



బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

బీసీ గురుకుల పాఠశాల తనిఖీ



సాగర్ బీసీ గురుకుల పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌సీవో స్వప్న

నాగార్జునసాగర్, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఉన్న మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలను జిల్లా ఆర్‌సీవో స్వప్న సోమవారం తనిఖీ చేశారు. సోమవారం ఉదయం సాగర్ బీసీ గురుకుల పాఠశాలకు వచ్చిన ఆమె పాఠశాలలో పలు రికార్డులను, రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం వసతి గృహంలో మెను, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు సలహాలు ఇచ్చారు విద్యా సంవత్సరం ముగుస్తుడడంతో పాటు ఐదో తరగతి ప్రవేశాలకు జరుగుతున్న కౌన్సిలింగ్ ప్రక్రియను పరిశీలించారు. అలాగే రెండో సమగ్ర మూల్యాంకన పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రిన్సిపల్ రాజశేఖర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మాధవి లత ఉన్నారు.

విద్యుత్ తీగలు తగిలి గడ్డి దగ్ధం



రోడ్డుకు అడ్డంగా దగ్ధమవుతున్న గడ్డికట్టలు

గుర్రంపోడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు తగిలి గడ్డి కట్టలు దగ్ధమైన సంఘటన గుర్రంపోడ్ మండలంలోని శాంతినగర్ వద్ద సోమవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... చామలేడు గ్రామానికి చెందిన దోటి నరేష్ తన ట్రాక్టర్‌లో 110 గడ్డికట్టలు తీసుకొని తెరాటిగూడెం గ్రామానికి వెళుతుండగా శాంతినగర్ వద్ద విద్యుత్ తీగలు తగిలి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. వెంటనే తేరుకున్న నరేష్ ట్రాక్టర్ ట్రాలీ పైకి ఎత్తడంతో గడ్డి కట్టలు రోడ్డుపై పడి పూర్తిగా కాలిపోయాయి. అగ్ని మాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో సంఘటన స్థలానికి వచ్చి మంటలు ఆర్పారు. తన మామ మండలి సత్తయ్యకు గడ్డి కట్టలు తీసుకువెళుతున్నట్లు నరేష్ తెలిపారు. వీటి విలువ సుమారు రూ. 10వేల వరకు ఉంటుందని తెలిపారు.

'ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

అడవిదేవులపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పరిసర గ్రామాల్లో దొంగలు చోరీలకు పాల్పడుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎవరైనా అనుమాని వ్యక్తులు గ్రామాల్లో తిరిగితే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ శేఖర్ తెలిపారు. సోమవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ కొద్ది రోజులుగా మండలంలోని పరిసర గ్రామాల్లో గల ఆలయాల వద్ద అనుమానిత వ్యక్తులు తిరుగుతున్నారని, ప్రజలు చెబుతున్నారని, బంగారం, వెండి వస్తువులు బ్యాంకుల్లో డిపాజిట్ చేయాలన్నారు. అదేవిధంగా ప్రస్తుతం వ్యవసాయ పనులు ముగిసిన ందున వ్యవసాయ పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లను ఆఫ్ చేసుకోవాలని ఆయన సూచించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



మాడ్గులపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన పెరుమాళ్ల రవి అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ పుల్లెంల సైదులు, కాంగ్రెస్ యువ నాయకుడు గడ్డం పురుషోత్తంరెడ్డిలు రవి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందించి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట ఎరుకల వెంకన్న, నరేష్, వెంకటయ్య, జానకిరాములు, నిరంజన్, నరేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చింతపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలం ఎం.మల్లేపల్లిలోని కుర్మాచల సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలను ఈ నెల 22 నుంచి 26 వరకు వైభవంగా నిర్వహించడానికి కమిటీ సభ్యులు సోమవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పువ్వులతో అలంకరించి సుందర మనోహరంగా అలకరించారు. రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారని సభ్యులు తెలిపారు.

నష్టపరిహారం అందజేయాలి

చింతపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి):ఆకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందజేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఉడుగుంట్ల రాములు డిమాండ్ చేశారు. సోమవారం చింతపల్లి మండలంలో మాట్లాడారు. రైతులకు నేటికి రుణమాఫీ చేయకపోవడంతో అప్పులు చేసి పంట సాగు చేస్తే ఆకాల వర్షాల కారణంగా నష్టం జరిగిందన్నారు.

సంత బహిరంగ వేలం నిర్వహించాలి

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి పశువుల సంతకు సంబంధించి కాంట్రాక్టర్‌కు సంబంధించి బహిరంగ వేలం నిర్వహించాలని కోరుతూ కొండమల్లేపల్లికి చెందిన కుంభం యాదగిరిగౌడ్ వినతిపత్రం అందజేశారు. 2016 నుంచి ఇప్పటి వరకు బహిరంగ వేలం నిర్వహించడం లేదని పేర్కొన్నాడు. ఈ సారి నిబంధనల మేరకు బహిరంగ వేలం నిర్వహించాలని అన్నారు.

అనారోగ్యంతో మునిసిపల్ ఉద్యోగి గిరి మృతి

దేవరకొండ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మున్సిపాలిటిలో శానిటరి ఉద్యోగి అంకూరి గిరి(52) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ మృతదేహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని తెలిపారు. అంకూరి గిరి మృతిపట్ల సంతాపం తెలిపినవారిలో ఎం.ఎ.సిరాజ్‌ఖాన్, అంకూరి దేవయ్య, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, ఆలంపల్లి నర్సింహ, ఎండి.యూనుస్, ఎమ్మార్పీఎస్ నాయకులు ఉన్నారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్